మనసులో మాట
KANCHARLA
నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం..
సంచలన తెలుగు దిన పత్రిక
ఉత్తరాంధ్ర
| విశాఖపట్నం | విజయనగరం | అనకాపల్లి |
| --- | --- | --- |
| శ్రీకాకుళం | అల్లూరి జిల్లా (పాడేరు) | పార్వతీపురం |

శుక్రవారం 29 మే 2026 పేజీలు 16

# ఆక్వా రంగ స్థిరత్వానికి పారదర్శక విధానాలే పరిష్కారం

- ఫీడ్, సీడ్ నాణ్యతపై కఠిన పర్యవేక్షణ
- మంత్రి అచ్చెన్నాయుడు



**శ్రీకాకుళం, మే 28 (మనసులో మాట) :**

ఆక్వాకల్చర్ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో పరిశీలిస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రింప్ ఫీడ్ ..మిగతా 2లో



# పాలకొండ లో కొలిక్కిరాని వర్గపోరు

మహానాడు కార్యక్రమంతో మళ్ళీ భగ్గుమన్న వర్గపోరు

- సీనియర్లకు ప్రాధాన్యత లేదని ఆవేదనలో సీనియర్లు
- పాలకొండ లో 2000 మందితో ర్యాలీ

**పాలకొండ, మే 28,మనసులోమాట :**

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో తెలుగుదేశం పండుగ మహానాడు ఆసక్తికరంగా జరుగుతుంది. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అయిన కర్నేన అప్పలనాయుడు, జాడ శ్రీధర్, ఇతర సీనియర్ నాయకులకు నియోజకవర్గస్థాయి మహానాడు కు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పడాల భూదేవి ఆహ్వానం పలకకపోవడంతో ఆయన మద్దతు దారులైన 32 పంచాయితీలకు చెందిన దాదాపు ..మిగతా 2లో



# చీడిగుమ్మలలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

- తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

2




# భోగాపురం ఎయిర్పోర్ట్ జూలై మొదటి వారంలో ప్రారంభం

- జూన్ 30 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు
- ఎయిర్ పోర్టు రోడ్డు అనుసంధానం
- పనులు వేగవంతం చేయాలి

**విశాఖసిటీ..మే28 (మనసులో మాట)**

భోగాపురం ఎయిర్పోర్ట్ జూలై మొదటి వారంలో ప్రారంభం జరగనున్నందున సంబంధిత శాఖల అధికారులు వేగంగా స్పందించి జూన్ 30 నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎయిర్పోర్టు కనెక్టివిటీ రోడ్లు, వి.ఎం.ఆర్.డి.ఏ. ల్యాండ్ పూలింగ్, ..మిగతా 2లో



# మహానాడుకు “గ్రహణం”

- రాష్ట్రవ్యాప్తంగా జోష్... కొయ్యూరులో మాత్రం వెలవెల
- పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు గైర్హాజరు.... అంతర్గత అసంతృప్తులే కారణమా?

2




2

# కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ పైఈడిదాడిసరికాదు

# ఆక్వా రంగ స్థిరత్వానికి పారదర్శక విధానాలే పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ధరల పెరుగుదల, ముడి పదార్థాల కొరత, రైతులపై పెరుగుతున్న వ్యయ భారం, ఎగుమతుల సవాళ్లు వంటి అంశాలపై మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో రైతులు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారులు, పరిశ్రమ ప్రతినిధుల అభిప్రాయాలను ప్రభుత్వం సమగ్రంగా విన్నదన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న వేసవి పంట సమయంలో ఫీడ్ ధరల పెంపు రైతులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, అదే సమయంలో ఫీడ్ పరిశ్రమ కూడా ముడి పదార్థాల ధరల పెరుగుదలతో ఒత్తిడిని ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరిశ్రమ నిలదొక్కుకునేలా సమతుల్య నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫీడ్, సీడ్ నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, సిసిటివి ఆధారిత హ్యాచరీ పర్యవేక్షణ, సీడ్ ట్రేసబిలిటీ, ఎల్.ఓ.టి. ఆధారిత మానిటరింగ్ వంటి సాంకేతిక చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. జీఎం సోయా దిగుమతులు, ఫిష్ మీల్ లభ్యత, దిగుమతి లైసెన్సులు, ఎగుమతి పోటీతత్వం వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. ఆక్వా రైతుల సంక్షేమం, ఫీడ్ పరిశ్రమ స్థిరత్వం, ఎగుమతుల వృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, అన్ని భాగస్వామ్యులు పరస్పర సహకారంతో ముందుకు రావాలని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, మత్స్యశాఖ కమిషనర్ రామశంకర్ నాయక్, అధికారులు, ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకట్రామిరెడ్డి, ఎఎసి సభ్యులు, ఎపిఎస్ఎడిఎ సభ్యులు, రైతు సంఘాలు, ఫీడ్ తయారీదారులు, ఎగుమతిదారుల సంఘాలు, పరిశ్రమ ప్రతినిధులు, ఇతర భాగస్వాములు పాల్గొన్నారు.

# కేరళ మాజీ సీఎం పినరయి విజయన్ పై ఈడిదాడిసరికాదు

**అరకులోయ, మే 28 (మనసులో మాట):**

కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ పినరయి విజయన్ పై కేంద్ర బిజెపి ప్రభుత్వం ఈడి దాడి కేసుల ద్వారా కక్ష సాధింపు రాజకీయాలు చేయడం సరి కాదని సిపిఎం పార్టీ నిరసనను తెలియజేసింది. సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈడి ద్వారా అక్రమంగా దాడితో పాటు అతనిపై అక్రమ కేసులు పెట్టి రాజకీయంగా వేధింపులకు గురి చేయడాన్ని ఖండిస్తూ దేశవ్యాప్తంగా సిపిఎం పార్టీ పిలుపు మేరకు గురువారం అరకులోయ ప్రధాన కేంద్రం నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ అరకులోయ సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ బీజేపీ కేంద్ర ప్రభుత్వ స్వాతంత్ర దర్యాప్తు సమస్యలను పావుగా వాడుకుంటూ ప్రతిపక్ష పార్టీ ముఖ్యంగా సిపిఎం పార్టీ పినరయి విజయన్ ఇంటిపై ఈడి సిపిఐ దాడి ఆపాలని కామ్రేడ్ పినరయి విజయన్ పై తప్పుడు ఆరోపణలు కేసులు వెంటనేఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా దేశంలో ఉత్తమ ప్రజాపాలన అందిస్తూ మచ్చలేని మార్క్స్ స్టు పార్టీ నాయకుడి పై నరేంద్ర మోడీ కేంద్ర దర్యాప్తు సంస్థలతో ఒత్తిడి చేయించి భయపెట్టే కార్యక్రమం చేస్తుందన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక పరిపాలన ప్రజల సంక్షేమం, విద్య, ఆరోగ్యం మత సామరస్యం వంటి అనేక అంశాలపై ఉత్తమ పాలన అందించిన మాజీ సీఎం ను ఈడి దాడుల పేరుట మానసికంగా ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని ఆయన ఆరోపించారు. దేశ సంపదను కొల్లగొట్టిన విజయ్ మాల్యా, నిరావ్ మోడీ వంటిదేశద్రోహులనుపట్టుకోవడానికి చేతకాని నరేంద్ర మోడీ నిజాయితీగా ప్రజా పాలన అందించిన నాయకులను తప్పుడు ఆరోపణలతో ఈడి స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో అధికార దుర్వినియోగం చేయడమనేది సిగ్గుచేటు అన్నారు. దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదాన్ని అరికట్టడం విఫలమై నిరుద్యోగ సమస్య పరిష్కరించలేక పెరిగిపోతున్న నిత్యవసర ధరలు తగ్గించలేక రోజుకు పెట్రోలు డీజిల్ ధరలు పెంచుకుపోతున్న కేంద్ర ప్రభుత్వం మచ్చలేని ఎన్డీపి ప్రభుత్వం కమ్యూనిస్టు పార్టీ నాయకుల పై ఈడి సోదలు చేయించడం సరికాదన్నారు. సిపిఎం పార్టీ సీనియర్ మండల నాయకులు పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కామ్రేడ్ పినరయి విజయన్ మాజీ ముఖ్యమంత్రి పై ఈడి కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు అన్నారు.

# చీడిగుమ్మలలో ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

- తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**గొలుగొండ,మే28,(మనసులో మాట):**



నందమూరి తారకరామారావు జయంతి, మహానాడు సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గం, గొలుగొండ మండలం, చీడిగుమ్మల గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ పార్టీ అధ్యక్షులు కామిరెడ్డి గోవిందు యువత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని ఆయనొక వ్యక్తి కాదని ఒక శక్తి అని కొనియాడారు. రాజకీయాల్లోకి వచ్చిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి పేదలకు రెండు రూపాయలకే కిలో బియ్యం వృద్ధులకు పెన్షన్లు, పెంకుటిళ్లు మంజూరు చేశారన్నారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, పద్మావతి యూనివర్సిటీ స్థాపనతో పాటు.. పాలనను చేరువ చేసేందుకు మండల వ్యవస్థ ఏర్పాటు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న ఘనత ఆయనదేనన్నారు. అద్భుత నటనతో పాటు సినిమాల ద్వారా సామాజిక మార్పుకు కృషి చేసిన మహనీయుడి ఆశయ సాధనకు తెలుగుదేశం పార్టీ అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు.

ఇదే వేదికపై నియోజకవర్గ, గ్రామ అభివృద్ధి పనులను స్పీకర్ వివరించారు. గత రెండేళ్లలో గొలుగొండ మండలానికి 353 పనుల కోసం రూ.44.20 కోట్లు మంజూరు చేశామన్నారు. చీడిగుమ్మల గ్రామంలో 1983లో కరెంటు ఏర్పాటు నుండి.. హౌసింగ్, మంచినీటి ట్యాంక్, రోడ్లు, శ్మశాన వాటిక, జెడ్పీ పాఠశాల తదితర సదుపాయాలు కల్పించామన్నారు. వీటితో పాటు రూ.1.93 కోట్లతో పీహెచ్సీ భవనం, ముస్లిం కమ్యూనిటీ హాల్ (మసీదు) కోసం రూ.20 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. అలాగే గత రెండు సంవత్సరాలలో గ్రామంలో రూ.1.50 కోట్ల వ్యయంతో 22 సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టామని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో మండల నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్పోర్ట్ జూలై మొదటి వారంలో ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

లేబొట్స్ అంశాలపై వీఎంఆర్డిఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బి, భోగాపురం ఎయిర్పోర్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్పోర్ట్ అనుసంధానం రోడ్ల పురోగతిని నిశితంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరం నుండి భోగాపురం ఎయిర్పోర్టుకు అనుసంధానం చేసే ఏడు రోడ్లతోపాటు ఇతర రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని కలెక్టర్ కోరారు. అధికారులు సమన్వయంతో మిషన్ మోడ్ తో పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణం , సైన్ బోర్డులు ,విద్యుత్ దీపాలు, బస్సు టెర్మినల్, చార్జింగ్ పాయింట్లు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రాపిడో, ఉబర్, ఓలా సర్వీసుల ఏర్పాటుకు ఆ ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలన్నారు.

ఈ సమావేశంలో వీఎమ్ఆర్డిఏ కమిషనర్ తేజ్ భరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వర్చువల్ గా, భీమిలి ఆర్డిఓ సంగీత్ మాథుర్, విఎంఆర్డిఏ ఎస్ఈ వినయ్, జీవీఎంసీ సీఈ సత్యనారాయణ రాజు, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, ఏపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంబాబు, ఆర్ అండ్ బి ఎస్ఈ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాలకొండ లో కొలిక్కిరాని వర్గపోరు

(మొదటి పేజీ తరువాయి)

2000 మందితో యాలాం జంక్షన్ నుండి కోటదుర్గమ్మ దేవాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.. తెలుగుదేశం పార్టీ నినాదాలతో ర్యాలీ ఆద్యంతం కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.. ఒకేపార్టీలో ఉన్న తమపై వివక్ష చూపడంపై కాసేపు నడి రోడ్డు మీద మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం కోటదుర్గమ్మ దేవాలయం వద్ద ఉన్న తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసారు. ఆహ్వానాలు అందివ్వడం తెలుగుదేశంలో నూతన సంప్రదాయానికి తెర తీస్తున్నారా అని ఆవేదన వ్యక్తం చేసారు .

# మహానాడుకు "గ్రహణం"

**కొయ్యూరు, మే 28 (మనసులో మాట):**

తెలుగు దేశం పార్టీకి మహానాడు అంటే కేవలం ఒక పార్టీ సమావేశం మాత్రమే కాదు... పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు, కార్యకర్తల ఉత్సాహానికి ప్రతీకగా భావించే అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమం. ప్రతి సంవత్సరం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ మహాసభలో రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని తమ ఐక్యతను చాటుకుంటారు. నాయకత్వం నుంచి వచ్చే సందేశాలు, రాజకీయ తీర్మానాలు, కార్యకర్తల సమీకరణ మహానాడుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈసారి కూడా మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహించగా... కొయ్యూరు మండలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపించింది. మండల కేంద్రంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు, యువత హాజరుకాకపోవడంతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.గతంలో భారీ ర్యాలీలు, బైక్ ప్రదర్శనలు, నినాదాలతో మారుమోగిన మహానాడు వేడుకలు... ఈసారి మాత్రం వెలవెలబోయినట్లు కనిపించాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్టీకి వెన్నెముకగా భావించే గ్రామస్థాయి తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున గైర్హాజరు కావడం గమనార్హంగా మారింది. కొంతమంది కీలక నాయకులు కూడా కార్యక్రమానికి దూరంగా ఉండటం మరింత చర్చకు దారి తీసింది. కార్యక్రమం నిర్వహించిన ప్రాంగణంలో ఆశించిన జన సమ్మర్థం కనిపించకపోవడంతో "కొయ్యూరులో మహానాడుకు గ్రహణం పట్టిందా?" అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో మహానాడు పేరుతో గ్రామాల నుంచి భారీగా తరలివచ్చే కార్యకర్తలు ఈసారి కనిపించకపోవడం పార్టీ అంతర్గత పరిస్థితులపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# స్వర్గీయ ఎన్టీఆర్ కు ఘన నివాళులు అర్పించిన: ఎమ్మెల్యే కోండ్రు

- హైబ్రిడ్ 'మహానాడు' సూపర్ హిట్
- కిక్కిరిసిన 'మహానాడు' ప్రాంగణాలు
- మహిళలకే అధిక ప్రాధాన్యం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- స్వర్గీయ ఎన్టీఆర్ బాటలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్
- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా భారీ కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే
- పసుపుమయంగా మారిన నియోజక వర్గం







**రాజాం (మనసులో మాట)**

తెలుగుదేశం పార్టీ అధినేత,రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు ఆదేశాలమేరకు, రెండవ రోజు హైబ్రిడ్ ' మహానాడు ' వేడుకలు, మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ ఆధ్వర్యంలో పది క్లస్టర్ లలో సందడి వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి,స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి, భారీ కేక్ ను కోసి నాయకులకు కార్యకర్తలకు తినిపించారు.

ముందుగా రాజాం క్లస్టర్ 5,6లో గల దేవీ శ్రీదేవి కళ్యాణ మండపంలో హైబ్రిడ్ మహానాడు వేడుకలో పాల్గొని, స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం రేగిడి మండలం, క్లస్టర్ 4 ఉంగరాడ మెట్ట అమరావతి తోటలో మహానాడు వేడుకలో పాల్గొన్నారు. అనంతరం వంగర మండలం మొదటి క్లస్టర్ ఎం ఎస్ ఆర్ పురంలో మహానాడు వేడుకలో పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు







- స్పీకర్ అయ్యన్నపాత్రుడి పిలుపు మేరకు మహా రక్తదాన శిబిరం

**నర్సీపట్నం రూరల్, మే 28, ( మనసులో మాట) :**

నర్సీపట్నం పట్టణంలో నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను రెండవ రోజు మహానాడులో తెలుగుదేశం పార్టీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా పట్టణ టీడీపీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 60 మంది స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల రాజేష్ మాట్లాడుతూ.. నర్సీపట్నంలో రక్తం నిల్వలు నిండుకున్నాయని, ఆ కొరతను తీర్చేందుకు రక్తదానం చేయాలని గౌరవ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇచ్చిన పిలుపు మేరకు ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే, పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పనిచేస్తున్న సీనియర్ నాయకులను ఈ రోజున సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీ కృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణలతో పాటు పలువురు మండల, మున్సిపల్ స్థాయి నాయకులు, పెద్ద ఎత్తున యువత, పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు.













మనసులో మాట

# జిల్లాలో 'అక్షర ఆంధ్ర ఉల్లాస్' కార్యక్రమం ప్రారంభం

- జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి, మే 28 :**

జిల్లాలో 100 శాతం వయోజన అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వ ప్రత్యేక అక్షరాస్యత కార్యక్రమం "అక్షర ఆంధ్ర" ను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, ఐ.ఏ.ఎస్. అధికారికంగా ప్రారంభించారు. 2029 నాటికి జిల్లాలో వయోజనులందరినీ విద్యావంతులను చేయడమే ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ మేరకు జిల్లా, మండలం మరియు మున్సిపల్ స్థాయిలలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఈ ఏడాది లక్ష్యం 71,194 మంది**

గడచిన 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా వయోజన విద్యాశాఖ ద్వారా 25 లక్షల మంది లబ్ధిదారులకు అక్షరాస్యత పరీక్షలు నిర్వహించగా, అందులో 24.74 లక్షల మంది ఉత్తీర్ణత సాధించారు. అదే స్ఫూర్తితో ఈ విద్యా సంవత్సరం (202627) లో కూడా మరో 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**మూడు స్థాయిల్లో పర్యవేక్షణ కమిటీలు**

కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి మూడు అంచెల కమిటీలను ఏర్పాటు చేశారు.

**జిల్లా స్థాయి కమిటీ :**

జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా, జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఇందులో జడ్పీ సీఈఓ, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు, డీఈఓ తదితర 11 మంది అధికారులు సభ్యులుగా ఉంటారు.

**మండల స్థాయి కమిటీ :**

మండలాధ్యక్షుడిగా ఎంపీడీఓ వ్యవహరిస్తారు.

**మున్సిపల్ స్థాయి కమిటీ :**

మున్సిపల్ కమిషనర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.

అధికారులు అందరూ ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# బక్రీద్ ను ఘనంగా జరుపుకున్న ముస్లింలు




**గంట్యాడ, మే 28 ( మనసులో మాట):**

బక్రీద్ పండుగను గంట్యాడ మండల పరిధిలో ఉన్న ముస్లిం సోదరులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మండల పరిధిలో ఉన్న గంట్యాడ, రామవరం గ్రామాల్లోని మసీదులకు ముస్లిం సోదరులు సంప్రదాయ వేషధారణలతో తరలివచ్చారు. మసీదులలో అల్లాను స్తుతిస్తూ నమాజ్ చేశారు. గంట్యాడ మండల కేంద్రంలోని మసీదులో మత పెద్ద మౌలానా ఆధ్వర్యంలో బక్రీద్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బక్రీద్ ప్రాముఖ్యత గురించి ముస్లిం సోదరులకు వివరించారు. గంట్యాడ, రామవరం గ్రామాల్లోని మసీదులకు బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

# హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా కార్యవర్గ ఎన్నికలు

- జిల్లా అధ్యక్షుడిగా కొణతాల రాజాబాబు...
- మహిళా అధ్యక్షురాలిగా గొర్లి కృష్ణవేణి....
- ముఖ్య అతిథులుగా రాష్ట్ర నేతలు బసవరాజు, పిల్లాడి రుద్రయ్య, రామరాజు, కొణతాల అప్పలరాజు హాజరు....



**అనకాపల్లి రూరల్, మే 28 (మనసులో మాట):**

రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారు ఆలయ సమీపంలో మయూరి ఫంక్షన్ హాల్ లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర నేతలు బసవరాజు, పిల్లాడి రుద్రయ్య, రామరాజు, కొణతాల అప్పలరాజు తదితరులు హాజరయ్యారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఆధ్యాత్మిక సమావేశంలో అనకాపల్లి జిల్లా కమిటీ గౌరవ అధ్యక్షులుగా కొణతాల రాజాబాబు, జిల్లా మహిళ దుర్గాశక్తి గౌరవ అధ్యక్షురాలుగా, మండల సంతోషి సుబ్బలక్ష్మి, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా గొర్లి కృష్ణవేణి (న్యాయవాది) చోడవరం, జిల్లా అధ్యక్షులుగా కొణతాల నాయుడుతో పాటు మిగిలిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హిందూ దేవాలయ పరిరక్షణ సమితి జిల్లా నూతన వర్గం మహిళలు పురుషులు కమిటీలు వేరువేరుగా ఎన్నుకున్నారు. అలాగే జిల్లాలో ఉన్నమండలాలకు అధ్యక్షులనుఎన్నుకున్నారు. మాడుగుల మండల అధ్యక్షుడిగా వాసు, ఎలమంచిలి మండల అధ్యక్షుడిగా రంగా రవి, చోడవరం మండల అధ్యక్షుడిగా ఎస్. వాసు, అనకాపల్లి అధ్యక్షుడిగా కోరిబిల్లి రమేష్, మునగపాక మండల అధ్యక్షుడిగా కాండ్రేగుల నారాయణరావు, అనకాపల్లి గ్రామీణ మండల అధ్యక్షుడిగా కపిల తాతారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నంద్యాల బసవరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 19 జిల్లాలకు కమిటీలు వేసామన్నారు. అనకాపల్లి జిల్లా కమిటీ అలాగే మండలాల కమిటీలు పూర్తి అయ్యాయన్నారు. దేవాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రానున్న రోజులలో చేపడుతున్న కార్యక్రమాల గురించి సభ్యులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సభకు అధ్యక్షత వహించిన హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొణతాలఅప్పలరాజుమాట్లాడుతూ హిందూదేవాలయాల పరిరక్షించడంలోను,హిందూభూములను కాపాడడం, పురాతదేవాలయాలపరిరక్షించడం, ధూప దీప నైవేద్యాలు నోచుకోని పురాతన దేవాలయాల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం,ధర్మదాయ దేవాదాయ పరిధిలో ఉన్న దేవాలయాల ఆదాయ వనరులను సంరక్షించడం,

# ఎస్.కోటలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

- నివాళులర్పించిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి



**శృంగవరపుకోట మే 28:(మనుసులో మాట ):**

తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) జయంతి వేడుకలు ఎస్.కోట మండల కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ జంక్షన్ వద్ద ఉన్న అన్నగారి విగ్రహానికి నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మీడియాతో మాట్లాడుతూ, "సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్ళు" అనే నినాదంతో పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ పరిపాలన సాగించారని కొనియాడారు. తెలుగువారి కీర్తిని ప్రపంచవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు నేటికీ పేదల గుండెల్లో నిలిచి ఉన్నాయని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల స్థాయి కన్వీనర్లు, భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొని అన్నగారికి ఘన నివాళులు అర్పించారు.

# నాగాపురం పంచాయతీలో మంచినీటి బోరు ప్రారంభం

**గొలుగొండ, మే 28:(మనసులో మాట):**



మండలంలోని నాగాపురం పంచాయతీ పరిధిలోని పల్లావూరు శివారు తలుపులమ్మ ఆలయం సమీపంలో నూతన మంచినీటి బోరును గురువారం ప్రారంభించారు. ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ బోరును ఎంపీపీ మణికుమారి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ యలమంచిలి రఘురామ చంద్రరావు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు భక్తులు రైతులకు తాగునీటి అవసరాలు తీర్చే విధంగా బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానికులు ఈ కార్యక్రమాన్ని స్వాగతించి ఆనందం వ్యక్తం చేశారు

మనసులో మాట
KANCHARLA

# టిడిపికి దూరంగా ఉన్నా.. అన్న విధానాలకు కట్టుబడే ఉన్నా..

- తప్పు ఎవరు చేసినా ప్రశ్నించే నైజం ఎన్టీఆర్ నుంచే అలవరింది
- తన ఆఖరి రక్తపు చుక్క వరకు నమ్మిన సిద్ధాంతం కోసం పోరాటం
- ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్



**విశాఖపట్నం :**

తాను తెలుగు దేశం పార్టీకి దూరంగా ఉన్నప్పటికీ.. తెలుగు దేశం విధానాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ అన్నారు. తెలుగు జాతి ఆత్మ గౌరవం, విశ్వ విఖ్యాత నటుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన దివంగత నందమూరి తారక రామారావు 103వ జయంతిని గురువారం ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించారు. ఇదే క్రమంలో విశాఖ సాగర తీరంలోని (ఆర్కే బీచ్) ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహానికి బి.వి. రామ్ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ కూడు, గూడు, ఉపాధి కల్పించాలన్న అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితోనే తెలుగు శక్తి కృషి చేస్తోందన్నారు. తప్పు ఎవరు చేసినా ప్రశ్నించే నైజం తనకు ఎన్టీఆర్ నుంచే అలవరిందన్నారు.

**ముస్లింల ప్రయోజనార్థం ఎకరా స్థలం కేటాయించాలి**

ముస్లింల ప్రయోజనార్థం ఎకరా స్థలం కేటాయించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కు తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ విజ్ఞప్తి చేశారు. బక్రీద్ సందర్భంగా నగరంలోని న్యూ కాలనీ ప్రాంతంలో ఉన్న హోటల్ సింకా గ్రాండ్ లో ముస్లింలను కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ.. ముస్లింల సౌకర్యార్థం ఒక ఎకరా భూమిని ప్రభుత్వం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రస్తుతం కొనసాగుతున్న మహానాడులో తీర్మానం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను బి.వి.రామ్ కోరారు.

# విద్యార్థుల లక్ష్య సాధనకు క్రమశిక్షణ ముఖ్యం

- ఎన్.సి.సి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ శశాంక్ కుష్వాహ్...



**టెక్కలి: మే 28 (మనసులో మాట)**

యువతరం, విద్యార్థులు తమ గమ్యాన్ని చేరుకొని లక్ష్యాన్ని సాధించేందుకు దగ్గర మార్గాలు ఉండవని, కృషి,అంకిత భావం, పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగడం ఒక్కటే మార్గమని ఎన్.సి సి 14వ ఆంధ్ర బెటాలియన్ శ్రీకాకుళం కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ శశాంక్ కుష్వా హ్ అన్నారు. నౌపడ ఆర్ఎస్ దరి ప్రణవి డిగ్రీ కళాశాల ఆవరణంలో అత్యాధునిక వసతు లతో నిర్మించిన ఎన్.సి.సి సబ్ యూనిట్ నూతన కార్యాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఎన్.సి.సి కేడేట్లు ను ఉద్దేశించి ప్రసంగించారు. దేశభక్తి, క్రమశిక్షణ అలవడేందుకు యువతరం ఎన్.సి.సి లో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రణవి డిగ్రీ కళాశాల యాజమాన్యం ఎన్.సి.సి సబ్ యూనిట్ కార్యాలయాన్ని అత్యాఆధునికంగా నిర్మించారని యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కళాశాలలో ఉన్న ఈ సదుపాయాన్ని డిగ్రీ చదివే పరిసర ప్రాంతాల విద్యార్థులు వినియోగించుకోవాలని శశాంక్ కుష్వాహ్ కోరారు. ఎన్.సి.సి 14 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రదీప్ కే మీనన్, సుబేదార్ మేజర్ బల్వంత్ సింగ్, పేడాడ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, డైరెక్టర్ పేడాడ చంద్రశేఖర్ ఆజాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్. రామారావు, సిటిఓ కే.రుక్మంగధరరావు, ఈ.ఎస్.ఎమ్. బి.మల్లేశ్వరరావు, పీ.బి. దేవి బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వి.భోగస్వామి, అధ్యాపకులు నర్తు కృష్ణారావు, హేమారావు, జి.కుమారి, ఎస్.రాజా, ఎం.అప్పన్న, హెచ్.స్రవంతి, నీలిమ తదితరులు పాల్గొన్నారు..

# డ్రగ్స్ మహమ్మారిపై ఈగల్ సెల్ యుద్ధం

**పార్వతీపురం మనసులో మాట , మే 28:**




యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాలపై సమాజమంతా అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పార్వతీపురం మన్యం జిల్లా ఈగల్ సెల్ పిలుపునిచ్చింది. డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, చట్టపరమైన పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు గురువారం పార్వతీపురంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో "సబ్‌స్క్రైబ్ ఈగల్ సోషల్ మీడియా & అవేర్నెస్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గౌరవ ఐజీపీ శ్రీ ఆకే రవి కృష్ణ, ఐపీఎస్, ఈగల్ ఎస్పీ (ఆపరేషన్స్) శ్రీ ఎం. మహేశ్వర్ రాజు, ఐపీఎస్, ఈగల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ కె. నాగేష్ బాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఈగల్ టీం సిబ్బందితో కలిసి నిర్వహించింది. అలాగే సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమం ముగింపులో మహిళలతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించి, "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదాలతో చైతన్య సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు.

# బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్టీఆర్





**ఎలమంచిలి టౌన్,మే28, మనసులో మాట,**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి గా నేటికి వెలుగొందుతు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న వ్యక్తి అన్న ఎన్టీ రామారావు ఒక్కరేననీ టిడిపి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తారాబత్తుల రాజశేఖర్ అన్నారు.

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గయ ఎన్టీ రామారావు 103 వ జయంతి సందర్భంగా గురువారం నాడు మహానాడు జరుగుతున్న ప్రాంగణంలో జయంతి ఉత్సవాలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజకీయమంటే తెలియని రోజుల్లో అన్న ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించి గ్రామ గ్రామానికి రాజకీయ విస్తరింపజేసిన మొట్టమొదటి వ్యక్తి ఎన్టీ రామారావు ఒక్కరే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గొర్ల నానాజీ, కార్యదర్శి ఆడారి ఆది మూర్తి, గొంతెన హరీష్, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, టిడిపి నాయకులు కోటారు సాంబ, ఆడారి రమణబాబు, కొటారు సాంబ,బాబురావు,కరణం రవి, ఓమ్మి రమణ, దంట్ల వెంకటస్వామి,తులసీ రామ్, గొంతేన హరీష్, మజ్జి రామకృష్ణ బొద్దపు రమణ ,గుర్రాల రామ్ లక్ష్మణ్, రమణబాబు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా నందమూరి జయంతి





**విజయనగరం, (మనసులో మాట) జిల్లా ప్రతినిధి, మే 28:**

మాజీ ముఖ్యమంత్రి, విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని గురువారం విజయనగరం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియం లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఎన్.టి.ఆర్ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్. ఓ సత్తిబాబు, సెట్విజ్ సి.ఈ. ఓ విశ్వేశ్వర రావు, కలెక్టరేట్ ఏ. ఓ దేవ్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**జిల్లా పోలీసు కార్యాలయంలో..**

జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

**మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో..**

సంక్షేమ, అభివృద్ధికి ఆధ్యుడైన స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆంధ్రులకు చిరస్మరణీయులని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు కొనియాడారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడుతూ ఆంధ్రుల ఆరాధ్య దైవంగా అందరి హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న ఎన్టీ రామారావు నటుడిగానే కాకుండా రాజకీయ నేతగా ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

## నాగేంద్రపాలెంలో పంటకాలువ ధ్వంసం చేయడంపై రైతుల ఆగ్రహం





**గొలుగొండ ,మే28,( మనసులో మాట):**

పంట కాలువను చదును చేసి ఇతర అవసరాలకు వాడుకునే విధంగా చేసిన వారిపై ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.పప్పుశెట్టిపాలెం గ్రామ పెద్ద చెరువు నుంచి ఉప్మాక చెరువుకుఅక్కడి నుంచి నరసింగపల్లి - జానకిరాంపురం మీదుగా కొత్త జోగంపేట వీరయ్య చెరువుకు వెళ్లే సాగునీటి పంటకాలువను కొంత భాగాన్ని చదును చేయడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. పంట కాలువ జట్టును ఆనుకుని కొంత భూమిని ఒక రియల్ ఎస్టేట్ యజమాని కొనుగోలు చేసినట్లు రైతులు తెలిపారు. వారి అవసరాలకోసమే కాలువను వినియోగించి కొనుటకు ఈ విధమయిన ప్రయత్నాలు జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పైభాగం నుంచి కిందకు వచ్చే పంటకాలువ నీరు ఇతర చెరువులకు వెళ్లకుండా కాలువను చదును చేసి, ప్లాట్లకు అనుకూలంగా మార్చారని రైతులు ఆరోపించారు. దీంతో ఆయకట్టు రైతులు భూమి యజమానితో ఘర్షణకు దిగారు.

పంటకాలువ ధ్వంసం కావడంతో సాగునీటి సరఫరా దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువను పునరుద్ధరించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో పంటభూములకు సాగు నీరు అందే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ కార్యాలయం కోసం స్థల పరిశీలన



- అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

**అనకాపల్లి రూరల్, మే 27 (మనసులో మాట):**

అనకాపల్లిజిల్లా బిజెపి పార్టీ కార్యాలయం నిర్మాణం కోసం అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాలలో పలుచోట్ల స్థల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణ పరిసర ప్రాంతాలలో బిజెపి పార్టీ కార్యాలయం అవసరం ఎంతైనా ఉంది. బిజెపి పార్టీ కేంద్ర కమిటీ రాష్ట్ర శాఖల ఆదేశాలతో అనేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు అలాగే జిల్లా కమిటీ స్థానిక అంశాలపై చేపట్టిన కార్యక్రమాలు పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తూ ఉంటారు. ఇంత వరకు అనకాపల్లి పట్టణంలో ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకొని కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యాలయం అనకాపల్లి పట్టణంలో నిర్మించాలని కార్యకర్తలు ఎప్పటి నుంచో రాష్ట్ర నాయకత్వంను కోరుతూ వస్తున్నారు. రాష్ట్ర కమిటీ విజ్ఞప్తిపై ఎట్టికేలకు జాతీయ కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలో భవన నిర్మాణ కమిటీ అనకాపల్లిలో పర్యటించనుంది. ఈలోగా పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు అనకాపల్లి పట్టణం అలాగే అనుకున్న ప్రాంతాలలో కార్యాలయ నిర్మాణానికి అనుకూలమైన స్థల పరిశీలన చేపట్టారు. ఈ క్రమంలో కొన్ని స్థలాలను కార్యాలయం అనుకూలంగా ఉంటాయని గుర్తించారు.

## ప్రొఫెసర్ "నాగేశ్వర్‌ను భయపెడితే అక్షరాన్నే అణచివేసినట్లే

### - మాజీ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు

- నిత్య ప్రతిపక్షమే అసలు జర్నలిజం
- సవాల్ విసిరిన కలానికి సంకెళ్లు.. ప్రశ్నిస్తే కేసులేనా?
- పవన్ 'కేసులు ఉపసంహరిస్తాం' ప్రకటన.. రాజకీయ వేడి తగ్గుతుందా?
- తెలంగాణ మేధావుల అండ.. ఆంధ్ర సంఘాల మౌనం
- 'తెలుగు ఆత్మగౌరవం' ముసుగులో కట్టడి
- న్యూట్రాలిటీ ఒక భ్రమ.. కులం కంబళి కింద మేధావులు
- ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

**పలాస మే 28 మనసులో మాట.**

రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావుపై వరుసగా నమోదవుతున్న కేసులను తీవ్రంగా ఖండిస్తూ పలాసకాశీబుగ్గ పురపాలక మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు గురువారం పలాసలోని తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు.



"ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను భయపెట్టడం అంటే అక్షరాన్ని అణచివేయడమే. ఒకే ఒక్క వాక్యాన్ని సాకుగా చూపి ఆయనపై దేశద్రోహం నుంచి మొదలుకొని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని చూడటం వెనుక ప్రశ్నించే గొంతులను బెదిరించి మీడియాను పాతరేసే కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. నిత్య ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన నిలబడి విశ్లేషణ చేసేవారిని టార్గెట్ చేయడం ద్వారా మిగతా జర్నలిస్టులకు, విశ్లేషకులకు పరోక్ష హెచ్చరికలు జారీ చేస్తున్నారు" అని గిరిబాబు అని అన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు అకాడమిక్ జర్నలిజం నుంచి వచ్చిన వ్యక్తి అని, 'ఎనాలసిస్' పత్రిక ద్వారా పోటీ పరీక్షల కంటెంట్ తయారు చేస్తూ, గ్రూప్స్ పాఠాలు చెబుతూ రెండు దశాబ్దాల పాటు వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారని గుర్తు చేశారు. వామపక్ష మేధావిగా రూపాంతరం చెందాక ఎమ్మెల్సీగా పనిచేశారని, పదవీ విరమణ తర్వాత కాంటెంపరరీ రాజకీయాలపై యూట్యూబ్, వెబ్ మీడియా వేదికగా విశ్లేషణ మొదలుపెట్టారని తెలిపారు. ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, జర్నలిజం ఇలా అనేక రంగాల్లో లోతైన అవగాహన ఉండటంతో ఆయన విశ్లేషణలకు ప్రజల్లో విశేష ఆదరణ పెరిగిందన్నారు. సవాల్ అంటే రాజకీయ నేతలే కాదు, కులనేతలే కాదు, జర్నలిస్టులు కూడా చేయగలరని ప్రొఫెసర్ నాగేశ్వరరావు నిరూపించారని కొనియాడారు.

## భరోసా పార్టీ అధ్యక్షుడు అభినయ్ కు బెయిల్

- గురువారం ఉదయం నర్సీపట్నం సబ్ జైల్ నుండి విడుదల
- 10 రోజుల్లో పాదయాత్ర తిరిగి ప్రారంభిస్తానన్న అభినయ్





**నర్సీపట్నం రూరల్, మే 28, ( మనసులో మాట) :**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భరోసా పార్టీ రాష్ట్ర బాధ్యుడు దారా అభినయ్ దర్శన్ కేసులో న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. గురువారం ఉదయం ఆయన అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ జైలు నుండి విడుదలయ్యారు. ఈనెల 20న ఆయనకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. విడుదల అనంతరం ఆయన న్యాయవాది వి గోవిందరావు తో కలిసి మీడియాతో మాట్లాడారు. నాపై దాడి చేశారని నేను చెబుతుంటే, కాదు నేనే దాడి చేయించుకున్నట్లు సృష్టించి సోషల్ మీడియాలో వైరల్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాతోపాటు మరో ఏడుగురిపై అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారని, అయితే తాను కాక మిగతా ఏడుగురికి స్టేషన్ బెయిల్ మంజూరు చేశారన్నారు. నాపై దాడి జరిగిన కేసులో నన్ను అరెస్టు చేయలేదని, నాకు సంబంధం లేని మతపరమైన విద్వేషాలు రెచ్చగొడుతున్నానని నాపై కేసు నమోదు చేసి నన్ను రిమాండ్ కు పంపించారని ఆయన తెలిపారు. పోలీసులు, జైలు సిబ్బంది నా పట్ల గౌరవప్రదంగానే వ్యవహరించారని, ఎటువంటి ఇబ్బంది పెట్టలేదని ఆయన తెలిపారు. నేను హార్ట్ పేషెంట్ అని తెలుసుకున్న న్యాయమూర్తి అర్ధరాత్రి సమయంలో కూడా నాకు మెడిసిన్స్ అందించారని ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఓటర్ల జాబితా సవరణకు సిద్ధమైన బి.ఎల్. ఓ కిట్లు

**విజయనగరం, మే 28 (మనసులో మాట):**



ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా బి.ఎల్.ఓలకు అందజేసే కిట్లను కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి గురువారం తన ఛాంబర్లో పరిశీలించారు. జూన్ 15 నుండి జూలై 14 వరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ లో భాగంగా బి.ఎల్. ఓలు ఇంటింటికీ సందర్శించడానికి అవసరమగు కిట్లను అందజేస్తారు. ఆ కిట్లలో స్టేషనరీ సామాగ్రి తో పాటు గొడుగు, వాటర్ బాటిల్ కూడా ఒక బాగ్ లో పెట్టి అందజేయనున్నారు. జిల్లాలోని 1847 మంది బి.ఎల్. ఓ లకు శుక్రవారం నుండి పంపిణీ చేయాలని కలెక్టర్ డి.ఆర్. ఓకు సూచించారు.

# మునగపాక లో రెండవ రోజు మహానాడు

## అదే జోరు అదే జోష్







**మునగపాక, మే 28, మనసులో మాట**

మండల కేంద్రం మునగపాక లో స్వర్గీయ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు సందర్భంగా మహానాడు కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు కూడా కార్యకర్తల్లో ఉత్సాహం పెల్లి బుకింది. అంచనాలకు మించి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభ ప్రాంగణం అంతా కార్యకర్తలతో దద్దరిల్లిపోయింది. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్, శ్రీ ధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రీ సాయి కృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. సభా ప్రాంగణం నుండి మహిళలు కోలాటాలతో ప్రదర్శనకు వచ్చి ఎన్టీఆర్కు నివాళులర్పించారు. ఎన్టీఆర్ అమర్ రహే, ఎన్టీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలతో హోరెత్తించారు, భావిస్థాయిలో మందు గుండు పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా సుదూర ప్రాంతాల నుండి పార్టీ శ్రేణులు తరలివచ్చి మహానాడు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ తన సొంత నిధులతో పార్టీ కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని దిగ్విజయంగా నడిపిన సందర్భంగా రాష్ట్ర టిడిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజన్న రమేష్ కుమార్, రాష్ట్ర గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం విజయ్ను ఘనంగా సత్కరించారు.

## మహానాడులో పాల్గొన్న యువ నాయకులు గొంతిన వెంకట హరీష్



**రాంబిల్లి, మే 28 మనసులో మాట**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావానికి ప్రేరణగా నిలిచిన మహానాడు వేడుకలు ఎలమంచిలి నియోజకవర్గంలో ఘనంగా కొనసాగుతున్నాయి. రాంబిల్లి మండలం క్లస్టర్4 పరిధిలోని నారాయణపురం కళ్యాణ మండపంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో పార్టీ యువ నాయకులు గొంతిన వెంకట హరీష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పప్పల చలపతిరావుతో కలిసి ఆయన కార్యకర్తలను ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా వెంకట హరీష్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మహానాడు కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయని పేర్కొన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలోని ప్రతి క్లస్టర్‌లో మహానాడు వేడుకలను విజయవంతంగా నిర్వహిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని తెలిపారు.

# రెండో రోజూ అదే జోష్ తో మహానాడు



**ఎచ్చెర్ల మే 28 (మనసులో మాట):**

ఎచ్చెర్ల నియోజకవర్గం విజయనగరం పార్లమెంటు పరిధిలో రణస్థలంలో టిడిపి మహానాడు కార్యక్రమం తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో 2వ రోజు గురువారం మహానాడు కార్యక్రమం ఘనంగా రణస్థలం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి సతీమణి ప్రభ నాయుడు, టీడీపీ విజయనగరం పార్లమెంటరీ ఉపాధ్యక్షులు డి జి ఎం ఆనందరావు తోపాటు రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, టిడిపి కుటుంబ సభ్యులు దెయ్యం శ్రీనివాసరావు, కె.వి.రమణ, శ్రీనివాసరావు, శ్రీరాములు, ఆది తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా హైబ్రిడ్ మహానాడు



- **పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందించిన నాయకులకు తగిన గుర్తింపు**
- **టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్**

**నర్సీపట్నం రూరల్, మే 28, (మనసులో మాట) :**

నర్సీపట్నంలోని పెద్ద బొడ్డేపల్లి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 'హైబ్రిడ్ మహానాడు' కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులకు సముచిత గౌరవం దక్కింది. పార్టీ ఆవిర్భావం నుండి అంకితభావంతో సేవలందించిన నాయకులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

నర్సీపట్నం నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధిలోని క్లస్టర్ 7 కు చెందిన ఎనిమిది మంది సీనియర్ నాయకులను టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి వారు చేసిన విశేష కృషిని ఈ సందర్భంగా నాయకులు కొనియాడారు. అనంతరం చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సీనియర్ నాయకులను గౌరవించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు.

## అమలగూడ గ్రామంలో కనరాని సౌకర్యం



- **రోడ్డు మంచినీళ్లు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్కు వినతిపత్రం**
- **తుప్పలు తొలగిస్తూ తాత్కాలిక రోడ్డుకు శ్రీకారం**

**అనంతగిరి మే 28 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి రాష్ట్రంలో ప్రతి ఇంటికి సురక్షితమైన మంచినీటి సౌకర్యం అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాలతో కలిసి పలు ప్రతిష్టాత్మక పథకాలు అమలు చేస్తూ అందులో భాగంగా పట్టణ ప్రాంతంలో జల్ జీవన్ మిషన్ 2. 0 వంటి పథకాలకు శ్రీకారం చేపట్టనుంది 2027 వికసిత్ భారత్ ప్రకారం 2028 నాటికి ప్రతి ఇంటికి మంచినీటి కులాయి ఏర్పాటు చేయాలని పథకాలు అమలు చేస్తుంది అయితే గిరిజన ప్రాంతంలో నేటికీ కనీసం మంచినీటి సౌకర్యం లేక పలు గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అనంతగిరి పంచాయితీ అమలగూడ గ్రామంలో ఏళ్ల తరబడి 10 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు గ్రామంలో మంచినీరు రోడ్డు సౌకర్యం లేక అనంతగిరిలో బుధవారం జరిగిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో అల్లూరి జిల్లా కలెక్టర్ నిశాంతి టి మండలంలో తెలుసుకున్న గ్రామస్తులు మంచినీళ్ల రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి పత్రం ద్వారా చిత్తగించాలని వేడుకోగా స్పందించిన జిల్లా కలెక్టర్ తమ గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేకపోగా మంచినీటి ఏర్పాటుకు సమగ్రి తరలించడానికి తమ గ్రామంలో గ్రామస్తులంతా కలిసి తుప్పలు తొలగించి తాత్కాలిక రోడ్డు నిర్మాణం కోసం శ్రీకారం చేపట్టారు గ్రామంలో రోడ్డు మంచినీరు సౌకర్యం సమస్యలను శాశ్వత పరిష్కారం చేస్తారని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామస్తులు అంత కలిసి తాత్కాలిక రహదారి ఏర్పాటు చేసుకుంటున మని గ్రామస్తులు తెలిపారు మంచి నీరు సౌకర్యం కల్పించి రోడ్డు సౌకర్యం కోసం నిధులు కేటాయించాలని గ్రామస్తులు కోరారు లేనిపక్షంలో ఇంజనీరింగ్ కార్యాలయం ముందు భారీ ధర్నాలతో నిరాశన కార్యక్రమం చేపడతామని గ్రామస్తులు కొర్ర గోపి కౌసల్య రాధా గ్రామ పెద్దలు తెలిపారు

# చట్టాలపై ప్రజలకు పోలీసుల అవగాహన కార్యక్రమం



**పార్వతీపురం మనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 28:**

సంకల్పం 2.0 కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డాపుసిల జంక్షన్ వద్ద గురువారం ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురం రూరల్, కొమరాడ పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, సిబ్బంది కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, మహిళలపై నేరాల నివారణ, సైబర్ మోసాల పట్ల అప్రమత్తత, రోడ్డు భద్రతా నియమాల ప్రాముఖ్యత, బాల్య వివాహాల నిర్మూలన వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.
ఈ సందర్భంగా అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు పంచుకోవద్దని, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు.

# రాజకీయ కక్ష సాధింపులను ఖండించిన సిఐటియు నేతలు




**( రాంబిల్లి మే 28 మనసులో మాట )**

కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇంటిపై, ఆయన బంధువుల ఇళ్లపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడి, సిబిఐలతో నిర్వహిస్తున్న దాడులను నిరసిస్తూ రాంబిల్లి మండలంలోని రాంపల్లిలో సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతోందని నాయకులు ఆరోపించారు.
ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి. దేవుడు నాయుడు మాట్లాడుతూ, పినరయి విజయన్‌ను సిద్ధాంత పరంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతో ఈడి, సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికే పలుమార్లు సోదాలు నిర్వహించి ఎలాంటి ఆధారాలు లభించకపోయినా ప్రతిపక్ష నాయకులపై కక్షపూరిత చర్యలు కొనసాగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.
దేశంలో రోజు రోజుకీ పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరుగుతున్నా వాటిని నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే మేధావులు, ప్రజా నాయకులు, ప్రతిపక్ష నేతలపై కుట్రలు పన్ని వేధించడం సిగ్గుచేటని మండిపడ్డారు.
దర్యాప్తులు జరపడం తప్పుకాదని, అయితే బీజేపీకి చెందిన ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, పెద్ద పారిశ్రామిక వేత్తల అవినీతి కేంద్ర ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు కి ఘన నివాళి







**అనకాపల్లి టౌన్, మే 28 మనసులో మాట:**

మహానాయకుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం ఆయనకు భావోద్వేగపూరితమైన నివాళులర్పించింది.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి మే 28వ తేదీని రాష్ట్ర ఉత్సవంగా జరపాలని తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, అదనపు ఎస్పీ ఎల్. మోహన రావు పాల్గొని, ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు.
ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ఎన్టీఆర్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచ స్థాయికి చాటిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. "ఆయన పరిపాలనా కాలం ప్రజారంజక పరిపాలనకు ఒక నమూనా. ఆయన అందించిన సేవలు, సంక్షేమ పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నాయి. తెలుగు సమాజానికి ఆయన చేసిన విశిష్ట సేవలను మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలి" అని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి (మహిళా పిఎస్, అనకాపల్లి) ఇ.శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు వెంకట నారాయణ, అశోక్ కుమార్, ఎస్.ఐ. రవికుమార్ లతో పాటు ఇతర పోలీసు అధికారులు కార్యాలయ సిబ్బంది పాల్గొని, ఘన నివాళులు అర్పించారు.

# రాంబిల్లి లో పసుపు జెండాల సునామీ.. భరత్ ఎంట్రీతో మండల రాజకీయాల్లో కొత్త చర్చ!"




**రాంబిల్లి మే 28 మనసులో మాట:**

రాంబిల్లి మండలం లాలం కోడూరులో మహానాడు రెండో రోజు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. పసుపు జెండాలతో కళకళలాడిన గ్రామం మొత్తం పండగ వాతావరణాన్ని తలపించింది. తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలను మరోసారి స్మరించుకున్నారు.
మహానాడు వేదికపై పార్టీ పట్ల అంకితభావం, ఎన్టీఆర్ సిద్ధాంతాల పట్ల విశ్వాసం స్పష్టంగా కనిపించిందని పలువురు నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ భారీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి మండలంలో పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చిన రాంబిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లాలం భరత్‌ను కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా లాలం భరత్ భావోద్వేగంగా మాట్లాడుతూ, "నా తల్లిదండ్రులు లాలం భాస్కరరావు, భవాని లు నాకు తెలుగుదేశం జెండా చూపించారు. ఆ జెండా నీడలోనే నా జీవితం, నా భవిష్యత్తు ఉందని చెప్పారు. పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు నాపై ఉంచిన నమ్మకాన్ని ఎల్లప్పుడూ కాపాడుకుంటాను. మీ అందరికీ జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటాను" అని పేర్కొన్నారు.

# విద్యాసంస్థల్లో మనస్తత్వవేత్తల నియామకాలు చేపట్టాలి : కేసలి

**విజయనగరం, మే 28 (మనసులో మాట) :**

రాష్ట్రంలో 8 నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసిస్తున్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇచ్చేందుకు శిక్షణ పొందిన అనుభవజ్ఞులైన మానసిక మనస్తత్వవేత్తలు (సైకాలజిస్ట్)ను నియమించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ పూర్వ ఛైర్ పర్సన్ కేసలి అప్పారావు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. పాఠశాలలు, కళాశాలాల్లో కిషోర బాలికలు టీనేజ్ బాలురకు ప్రస్తుత సమాజంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో కౌన్సిలింగ్ ఆవశ్యకత తప్పనిసరిగా ఉందన్నారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచములో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. విద్యార్థుల్లో సోషల్ మీడియా, టీవీలు, సినిమాలు, సీరియల్స్, రీల్స్ ప్రభావం, దురలవాట్లు, చెడు స్నేహాలు, మత్తు పదార్ధాలు, మద్యం సేవించడం, చెడు ఆహారపు అలవాట్లు, దురుసు ప్రవర్తన, వేధించడం, పొగ త్రాగడం తదితర వ్యసనాలకు గురై, చదువుకు దూరంగా ఉంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కౌన్సిలింగ్ అవసరమని ఆయన పేర్కొన్నారు.



# స్వర్గీయ ఎన్టీఆర్ కు భారతరత్న ప్రకటించాలి





- **హైబ్రిడ్ మహానాడులో ఎంపీ కలిశెట్టి దంపతులు**

**ఎచ్చెర్ల మే 27 మనసులో మాట:**

శ్రీకాకుళం జిల్లా, ఎచ్చెర్ల నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకమైన పసుపు పండగ మహానాడు కార్యక్రమాన్ని ఈరోజు, రేపు రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ విధానంలో జరుగుతుండగా ఈరోజు విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గం లో 10 క్లస్టర్లలో జరుగుతున్న హైబ్రిడ్ మహానాడు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ప్రధమంగా రణస్థలం మండలం జె. ఆర్.పురం హెడ్ క్వార్టర్ లో గల కళ్యాణ మండపంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమం ద్వారా ప్రారంభించారు. హైబ్రిడ్ మహానాడు 2026 కార్యక్రమంలో టిడిపీ జాతీయ అధికార ప్రతినిధి,ఎంపీ కలిశెట్టి, ఆయన సతీమణి ప్రభ నాయుడుతో కలిసి క్యాంప్ కార్యాలయం నుండి సైకిల్ తొక్కుతూ మహానాడు వేదిక వద్దకు వచ్చారు.

ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి మాట్లాడుతూ నాయకులకు, కార్యకర్తలకు అందరికీ మహానాడు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మహానాడు అనేది ముఖ్యంగా మనందరి కార్యకర్తల పండగని, పార్టీ అధిష్టానం ముఖ్యంగా కార్యకర్త - అధినేత అనే నినాదాన్ని తీసుకొని కార్యకర్తల సంక్షేమం, వారికి పార్టీలో గౌరవ సముచిత కల్పించే విధంగా మహానాడు వేదికగా తీర్మానాలు చేయటం బహుశా ప్రపంచంలో మరే యితర పార్టీకి ఉండకపోగా , ప్రధానంగా కార్యకర్తలను ఉద్దేశించి ఇటువంటి కార్యక్రమాలు చేయడం తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలపై ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమని తెలియజేస్తూ..

డిజిటల్ మహానాడు 2026 యొక్క ప్రధాన థీమ్ "స్త్రీ శక్తి "అనే నినాదాన్ని తీసుకొని పార్టీ అధిష్టానం మహిళల రక్షణ, సాధికారత, అభ్యున్నతకై తీర్మానాలను ఆమోదించి మహిళల హక్కులు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, మరియు రాజకీయ ఎదుగుదలకు తీసుకుంటున్న చర్యల గురించి మహానాడు వేదికగా ప్రత్యేకంగా చర్చలు జరపడం అనేది తెలుగుదేశం పార్టీకి మహిళల అభ్యున్నతి పట్ల ఉన్న అంకిత భావానికి నిదర్శనం అనే అన్నారు.

## మూలపేటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా

- **జనసేన పార్టీ అధ్యక్షుడు కాండ్రేగుల గాంధీ**




**మునగపాక, మే 28, మనసులో మాట**

మూలపేట గ్రామంలో గత నాలుగు రోజులు గా మొత్తం వాటర్ ట్యాంక్ కు మరియు ట్యాంక్ నుంచి గ్రామం లో అన్ని కొళాయి పైప్ లైన్ లు కి వెళ్లే మోటారు లైన్ కి సంబంధించి వాల్ పైప్ లైన్ మరమ్మతులకు గురి కావడంతో చాలా నీరు వృధాగా పోతుంది . ఫలితంగా తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. లీక్ ప్రదేశం లో నీరు వృధాగా పోవడం, ట్యాంక్ కి నీరు సరిగ్గా ఎక్కకపోవడం,గ్రామం లో కోలాయి లో నీరు సరిగ్గా రాకపోవడం మహిళలు కొళాయి దగ్గర ఇబ్బందులు పడడం జరుగుతుంది. ఈ విషయం గమనించిన కూటమి నాయకులు కాండ్రేగుల గాంధీ మరియు జెకె బ్రదర్స్ ఆడారి ఆనంద సన్యాసినాయుడు, ఆడారి జగన్నాధ రావు పంచాయతీ అధికారులు దృష్టి కి తీసుకువెళ్లి కొత్త వాల్ వేయించి కొళాయి సమస్య పరిష్కరించడం జరిగింది. అలాగే రానున్న రోజుల్లో మొత్తం గ్రామం అంతా కొళాయి పైప్ లైన్ ఏర్పాటుచేసి శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని గాంధీ తెలిపారు.

## మహిళలకు పలు చట్టాలపై అవగాహన కలిగించిన న్యాయమూర్తి




**నర్సీపట్నం రూరల్, మే 28, ( మనసులో మాట) :**

పెద్ద బొడ్డేపల్లి లోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా ) స్త్రీ శక్తి భవన్ లో నర్సీపట్నం అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఎం రోహిత్ డ్వాక్రా మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోక్సో చట్టం, దిశా చట్టం, జాగృతి, వరకట్న నిషేధ చట్టం తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నూకరాజు, దావీదు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పినరయి విజయన్‌పై ఈడి దాడులను ఖండిస్తూ సీపీఎం నిరసన ర్యాలీ.




- **అక్రమ కేసులు ఉపసంహరించాలి: హుకుంపేట సీపీఎం మండల కమిటీ డిమాండ్**

**హుకుంపేట మే 28 మనసులో మాట**

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు పినరయి విజయన్ నివాసాలపై ఈడి దాడులు చేపట్టడాన్ని ఖండిస్తూ సీపీఎం హుకుంపేట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శులు వి.లక్ష్మణరావు, టి.కృష్ణరావు, ఎస్.హైమావతి మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదల, మతోన్మాదం, ఆర్థిక అసమానతలు వంటి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రతిపక్షాలపై ఈడి, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

దేశానికి ఆదర్శంగా నిలిచిన కేరళ రాష్ట్రంపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం, కాంగ్రెస్ కలిసి కుట్రపూరిత దాడులు చేస్తున్నాయని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొద్ది రోజులకే మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లపై ఈడి దాడులు జరపడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు పి.చిరంజీవి సీపీఎం నాయకులు కె.ఆసు, ఎస్.చంద్రుబాబు, , టి.అప్పలకొండపడల్, జి.ఆనంద్, ఎస్. కీర్తన తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన పట్టణ పోలీసులు




**నర్సీపట్నంరూరల్ , మే 28, (మనసులో మాట) :**

గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను నర్సీపట్నం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ షేక్ గఫూర్ అందించిన వివరాల ప్రకారం.. ముందుగా అందిన సమాచారం మేరకు మున్సిపాలిటీలోని బైపురెడ్డిపాలెం బ్రిడ్జి వద్ద పట్టణ ఎస్సై జె రమేష్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ఒక స్కూటీ ( ఏపీ 40 హెచ్ వి 7853)పై నర్సీపట్నం వైపు నుండి వస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా స్కూటీ డిక్కీలో 12 ప్యాకెట్లలో 6 కిలోల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సంఘటనలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, బయలుకించంగి గ్రామానికి చెందిన కాకరి శివతేజ, ప్రకాశం జిల్లా గిద్దలూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్ వల్లిలను మధ్యవర్తుల సమక్షంలో అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుండి గంజాయితోపాటు, స్కూటీని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించామన్నారు. ఈ సమావేశంలో పట్టణ ఎస్సైలు జె రమేష్, జి ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగు జాతి గర్వకారణం ఎన్‌టీఆర్ జయంతి వేడుకలు



**పార్వతీపురంమనసులో మాట జిల్లా ప్రతినిధి , మే 28**

తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మాజీ ముఖ్యమంత్రి, విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను పార్వతీపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించి కోట్లాది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత ఎన్‌టీఆర్‌కు జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి, డిఆర్‌ఓ కె హేమలత అధికారులు ఘన నివాళులు అర్పించారు. ఎన్‌టీఆర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రిగా ఎన్‌టీఆర్ పేదల సంక్షేమానికి అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి సామాన్య ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారని పేర్కొన్నారు. తెలుగు జాతి గౌరవాన్ని జాతీయ స్థాయిలో చాటిచెప్పిన మహానేతగా ఆయన చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

ప్రజా సేవ, నిబద్ధత, సంక్షేమ పాలనలో ఎన్‌టీఆర్ చూపిన మార్గం నేటి తరాలకు ఆదర్శమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని ఎన్‌టీఆర్ సేవలను స్మరించుకున్నారు.

# ముత్యాల వెంకటేశ్వరరావు సేవలు పేదలకు మేలు....



- **సంపదపురం సంపతిపురం గ్రామస్తులు**

**అనకాపల్లి రూరల్, మే 28 (మనసులో మాట):**

ప్రముఖ సంఘ సేవకులు పారిశ్రామికవేత్త బిజెపి రాష్ట్ర నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు ఎం.వి.ఆర్ చేస్తున్న సేవలతో పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని సంపత్పురం గ్రామ మహిళలు పేర్కొన్నారు. బుధవారం ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులతో స్థానిక మహిళలు సమావేశం నిర్వహించారు. అనకాపల్లి మండలం, సంపతిపురం గ్రామ ప్రజలకు బిజెపి నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు చేస్తున్న వివిధ సేవ కార్యక్రమాలు గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు ముత్యాల వెంకటేశ్వరరావు ట్రస్టు ఆధ్వర్యంలో చేపడుతున్న అనేక సేవా కార్యక్రమాలు గురించి స్థానిక ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు స్థానిక మహిళలతో మాట్లాడుతూ ఉచిత తీర్థ యాత్ర సేవ కోసం స్థానిక ప్రజలను నమోది చేయు కార్యక్రమం చేపట్టామన్నారు.

గ్రామ ప్రజలతో ఎం.వి.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత తీర్థయాత్ర గురించి తెలియజేయడం జరిగింది.

చారిటబుల్ ట్రస్ట్ అనకాపల్లి, పెందుర్తి, ఎల్లమంచిలి నియోజకవర్గాల ఇంచార్జి గైపురి రాజు, సాధుపుడి గణేష్,సంపతిపురం గ్రామ మహిళలు & గ్రామ పెద్దలు, దేశెట్టి రాజేశ్వరి గారు,కన్నం అప్పలనారస,గొర్ల బంగారు తదితరులు పాల్గున్నారు.

# మహానాడు సభకు ఉత్సాహంగా తరలి వెళ్తున్న తెలుగు తమ్ముళ్లు





- **దుంబరి శ్యామ్ రాకతో పసుపు శ్రేణుల్లో నూతన ఉత్సాహం**

**అనంతగిరి మే 28 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో మహానాడు వేడుకల సందడి నెలకొంది. మహానాడు సభకు ఉత్సాహంగా తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు మండల యువత అధ్యక్షులు దుంబరి శ్యామ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత మహానాడు కార్యక్రమానికి తరలి వచ్చారు మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం నుండి పసుపు జెండాలతో, నినాదాలతో కార్యకర్తలు ఉత్సాహంగా బయలుదేరి పార్టీ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా యువత అధ్యక్షులు దుంబరి శ్యామ్ మాట్లాడుతూ, మహానాడు అనేది తెలుగుదేశం పార్టీకి కేవలం ఒక సమావేశం మాత్రమే కాకుండా పార్టీ భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకంగా నిలిచే వేదిక అని పేర్కొన్నారు. పార్టీ అధినేతల సందేశాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజలకు మరింత చేరువ కావడానికి యువత ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. యువత, మహిళలు, సీనియర్ నాయకులు ఒకే వేదికపై ఐక్యంగా నిలబడటం పార్టీ బలాన్ని మరింత పెంచుతుందని అన్నారు. దుంబరి శ్యామ్ రాకతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపించిందని నాయకులు తెలిపారు. మహానాడు కార్యక్రమానికి బయలుదేరే ముందు మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు సమావేశమై నాయకులకు ఘన స్వాగతం పలికారు. ర్యాలీ చేస్తూ, నినాదాలు, పసుపు కండువాలతో మండల కేంద్రం సందడిగా మారింది. యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# డిజిటల్ మహానాడు రెండవ రోజు సీనియర్లకి ఘనంగా సన్మానం





**వి మాడుగుల మే 28 (మనసులో మాట)**

మాడుగుల షాదీకాన్ లో రెండో రోజు మహానాడు భాగంగా మన శాసనసభ్యులు శ్రీ బండారు సత్యనారాయణ మూర్తి తనయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు పాల్గొని తెలుగు జాతి ఆత్మగౌరవం ప్రతీక మహానటుడు ప్రజానాయకుడు మాజీ ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మాడుగుల బస్ స్టాండ్ వద్ద వున్నా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి, ఆయనమాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్ గారిని కొనియాడారు సీనియర్ నాయకులనుఓంద్రు కృష్ణ, అప్పాన రమణ, కొర్ని దేవుడు, అప్పాన్న భాస్కరరావు, అలమండ సూర్యారావు, మరో ముగ్గురిని సన్మానించడం జరిగింది ,ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, టిడిపి మండలాధ్యక్షుడు నందరకు సన్యాసిరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు పుప్పాల లక్ష్మీనారాయణ, లెక్కల కాశి బాబు, కోపరేటివ్ సొసైటీ చైర్మన్ కోట్నాల త్రినాధరావు,

# మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో వీర మహిళ సరోజిని జన్మదిన వేడుకలు

**మునగపాక, మే 28, మనసులో మాట**



ఘనంగా వీర మహిళ సరోజిని జన్మదిన వేడుకలు మునగపాక మండల కార్యాలయంలో జనసేన పార్టీ వీర మహిళ కె సరోజిని జన్మదినం సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడారి శ్రీకాంత్, సూరిశెట్టి అప్పలనాయుడు, సుందరపు ధనలక్ష్మి, రంగాల సరస్వతి, కారుకొండ కాశి, ఎలక రవి, కొయిలాడ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల జనసేన పార్టీ అధ్యక్షుడు టెక్కలి పరశురాం మాట్లాడుతూ పార్టీకి విశేషంగా కృషి చేస్తున్న సరోజిని మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# సీతానగరం లో కాంగ్రెస్ జెండా ఎగరాలి

## బత్తిన మోహన్ రావు పిలుపు

**పార్వతీపురం మనసులో మాట మే 28 :,**



సీతానగరం మండలంలో జోగంపేట శ్రీ భోగెమ్మ తల్లి సంబరాలలో పార్వతీపురం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బత్తిన మోహన్ , కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని అమ్మ వారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా సీతానగరం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మండల స్థాయిలో బిఎల్ఎ నియమకాలు పై దృష్టిసారించాలని కోరారు ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాలక రంజిత్ కుమార్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్వతీపురం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తీళ్ల గౌరీ శంకర్రావు సీతానగరం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీళ్ల నరసింహనాయుడు, మజ్జి వెంకట్నాయుడు, జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి చంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం జంక్షన్ వద్దఎండిన చెట్లును తొలగించాలంటూ పోలీసులు కు వినతి





**ఎస్. రాయవరం, మే 28,(మనసులో మాట):**

ఎస్. రాయవరం మండలం ధర్మవరం గ్రామంలో ఆటోస్టాండువద్ద జాతీయ రహదారి కిఆనుకొని ఉన్న ఎండిన చెట్లును తొలగించాలంటూ ఎస్. రాయవరం పోలీసులుకు ఆగ్రామస్తులు గురువారం వినతిపత్రం అంద చేసారు. ఈదరుగాలలు వీచే సమయంలో చెట్టుకొమ్మలు విరిగి ప్రమాదాలు జరగక ముందే ఆచెట్లును తొలగించాలని విజ్ఞప్తి చేసారు. ధర్మవరంజాతీయ రహదారిపై విద్యుత్ దీపాలు వెలగక అంధకారంగా మారుతుందని, స్థానిక ప్రజలుతమ అవసరాలుకోసం రోడ్డుదాటి వెళ్ళవలిసి ఉన్నందున విద్యుత్ దీపాలు వెలిగించేందుకు చర్యలు తీసుకోవాలంటూ ఎఎస్ఐ వేంకటేశ్వర్లుకువినతి పత్రం అందచేసారు. ధర్మవరం జంక్షన్ నుండి వివిధగ్రామాలుకు వెళ్ళే ప్రయాణీకులు ఇక్కడ బస్ స్టాప్ వద్ద బసైసుదిగవలిసి వస్తుందినివెంటనే విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఎంజిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం అప్పలరాజు, పవన్ కుమార్, దుర్గా ప్రసాద్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



**రాంబిల్లి, మే 28 మనసులో మాట**

రాంబిల్లి మండలం రాజు కోడూరు బస్టాప్ సమీపంలో గురువారం కారు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన చోటుచేసుకుంది. రాంబిల్లి నుంచి వెంకటాపురం వైపు వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీలు కొట్టినట్లు స్థానికులు తెలిపారు.

ఈ ప్రమాద సమయంలో కారులో డ్రైవర్ ఒక్కరే ఉండడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ఘటన సమాచారం అందుకున్న స్థానికులు, ప్రయాణికులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయం అందించారు.

డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడిపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## స్వర్గీయ ఎన్టీఆర్ కు టిడిపినేతలు ఘన నివాళి





**ఎస్. రాయవరం, మే28,(మనసులో మాట):**

స్వర్గీయ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీవ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. అడ్డురోడ్డు జంక్షన్ లోని ఎన్టీరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను పలువురునేతలు వివరించారు. అనంతరం పెద్దగుమ్మలూరు, ఎస్. రాయవరంలో ఏర్పాటుచేసిన మహానాడు వర్చువల్ సమావేశాల్లో నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి బి. శారదా కుమారి, వైస్ ఎంపిపి బి గోవిందరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షుడు ఎ. అబద్ధం, మాజీ ఎంపిపి యేజర్ల వినోద్ రాజు, కోరుప్రోలు పిఏసి ఎస్ చైర్మన్ రామకృష్ణ,వి.గోవింద్, వెంకట్రాజు, అల్లు నర్సింహ మూర్తి, అల్లు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 30న నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా

- 20 ప్రముఖ కంపెనీల ఉద్యోగాల నియామకానికి సన్నద్ధం



**నర్సీపట్నం రూరల్, మే 16 , ( మనసులో మాట ) :**

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని అచ్యుతాపురం ఎస్ ఏ జెడ్ లోని ఏపీఐఐసీ వన్ స్టాప్ సర్వీస్ సెంటర్ వద్ద ఈనెల 30న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఎన్ గోవింద రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదవ తరగతి నుండి పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఐటిఐ, డిప్లొమా విద్యార్హత కలిగిన 18 నుండి 40 సంవత్సరముల వయసు గల స్త్రీ, పురుషులు అర్హులని ఆయన తెలిపారు. ఈ మేళాలో సుమారు 20 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను నైపుణ్యం వెబ్ సైట్ naipunyam. ap. gov. in నందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 30వ తేది ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ నంబర్ తో పాటు తమ ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ లు, రెజ్యూమ్ తో జాబ్ మేళా జరుగు ప్రదేశం వద్ద హాజరుకావాలని, మరిన్ని వివరాలకు 8142565416 నంబరును ఫోన్ ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

## త్యాగానికి విశ్వాసానికి సమానత్వానికి ప్రతీక బక్రీద్

**పలాస మే 28 మనసులో మాట.**



త్యాగానికి విశ్వాసానికి సమానత్వానికి ప్రతీక గా నిలిచే పండుగ బక్రీద్ అని ముస్లిం సోదరు లు సోదరీమణులు కీర్తించారు మందస లోని ముస్లిం వీధిలో బక్రీద్ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు ఈ వేడుకల్లో హరిపురం సోంపేట రామకృష్ణాపురం మందస ప్రాంతాల నుంచి ముస్లిం కుటుంబాలు పాల్గొన్నా రూ ఐకమత్యంతో మెలగాలని మతాలు కులాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని ప్రపంచము దేశము సుఖ సంతోషాలతో ఉంటూ శాంతియుతంగా ఉండాలంటూ ముస్లిం కుటుంబాలు అల్లాను ప్రార్థించారు .అల్లా మసీదు వద్ద నమాజ్ చేశారు. సమాజంలో పరస్పర ప్రేమ కరుణ త్యాగాన్ని పెంపొందించుకోవాలని అల్లాను ప్రార్థించారు. పలువురు ప్రముఖులు ఈ వీధికి వెళ్లి ముస్లిం కుటుంబాలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు ముస్లిం సోదరులను అలింగణం చేసుకున్నారు

# నేడు నియోజకవర్గంలో ఒకరోజు 4 పర్యటనలు

**చోడవరం మే 28 మనసులో మాట:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఒక నియోజకవర్గం నాలుగు పర్యటనలు కార్యక్రమం శుక్రవారం చోడవరం నియోజకవర్గంలో చేపట్టనున్నట్టు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భూ పరిపాలన కమిషనర్ మార్గదర్శకాలు ప్రకారము ఈ కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం గంట వరకు మాధవ ఫంక్షన్ హాల్ స్థానిక ఎమ్మెల్యే ప్రారంభించినట్టు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎలాంటి అర్జీలు మిగిలి ఉండకుండా సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దడంతోపాటు ప్రజల ఫిర్యాదుల పరిష్కార సేవలను వారి ఇంటి వద్దకే చేర్చడం ఫిర్యాదులను కేవలం ఒక నెల వివదలోని ఒకే సమస్యపై ప్రజలు పదేపదే ఫిర్యాదులు చేయకుండా ఈ కార్యక్రమం లక్ష్యము అని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అధికారులు తమ సమస్యలకు సంబంధించిన పూర్తి వివరాలతో జిల్లా కలెక్టర్ కోరారు. ఇప్పటివరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిష్కరించబడిన దరఖాస్తుల వివరాలు పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల సంఖ్యతో పాటు ఒకే వ్యక్తి నుండి ఒకే సమస్యపై పదేపదే వచ్చిన పునరావృత అర్జీలు వివరాలుతో సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

# కశింకోట నూరి మసీద్ లో ఘనంగా బక్రీద్ వేడుకలు



- **బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ శాసనసభ్యులు.. పీలా గోవింద సత్యనారాయణ**

**కశింకోట, మనసులో మాట:**

మండల కేంద్రంలో గల, నూరి మసీదులో ఈదుల్ ఆదా బక్రీద్ నమాజ్ ' (బక్రీద్)పండగ ఘనంగా జరిగింది. మండల పరిధిలోగల ముస్లిం సోదర సోదరీమణులు హాజరయ్యి బక్రీద్ పండుగ నమాజును ఆచరించారు. ఈ సందర్భంగా మసీదు పెద్దలు ప్రత్యేక ప్రార్ధనలు ఆచరింపచేసి కుద్బా పట్టించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇంఫాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ బక్రీద్ పురస్కరించుకొని జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు బాబర్ కు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బక్రీద్ విశిష్టత గురించి టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్.కె రెహమాన్ (బాబర్) మసీదు పెద్దలు మాట్లాడుతూ..
బక్రీద్, పండుగను'ఈద్ఉల్హజా' అని కూడా పిలుస్తారు, ఇది' ''ఈద్ఉల్హజా'' త్యాగాల పండుగ , ముస్లింల కు అతి ముఖ్యమైన రెండవ పండగ ఇది అన్నారు. ఇస్లామిక్ క్యాలెండర్, జిల్ హిజ్జు నెలలో పదవ రోజు వచ్చే రెండవ అతిపెద్ద పండుగ ఇది అన్నారు. బక్రీద్ రోజున ఉదయాన్నే ముస్లింలు అందరూ కొత్త దుస్తులు ధరించి, ఈద్గా లేదా మసీదులకు వెళ్లి సామూహికంగా ప్రత్యేక నమాజ్ చేస్తారు. ఈ నమాజ్ తర్వాత ఒకరికొకరు 'ఈద్ ముబారక్' చెప్పుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకుంటారు. పండుగలో అత్యంత ముఖ్యమైన ఘట్టం 'ఖుర్బానీ'. అల్లాహ్ పేరు మీద గొర్రెలు, మేకలు లేదా ఇతర జంతువులను బలి ఇస్తారు. ఈ ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ కుర్బానీని ఉపవాసంతో భక్తితో చేయాలి.బలి ఇచ్చిన మాంసాన్ని మూడు భాగాలుగా విభజిస్తారు: అందులో ఒక భాగం తమ కుటుంబం కోసం. రెండవ భాగం బంధువులు, స్నేహితుల కోసం. మూడవ భాగం పేదలకు అభాగ్యులకు పంచాతారు. ఇది పేదరికాన్ని నిర్మూలించడంలో సమాజంలో అందరూ కలిసికట్టుగా పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో చేస్తారు అని చెప్పారు. బక్రీద్ అనేది కేవలం ఒక మతపరమైన వేడుక మాత్రమే కాదు, అది మానవత్వానికి, దయకు త్యాగనిరతికి ప్రతిబింబం. ప్రతి ఒక్కరి జీవితంలోనూ దైవభక్తి, పరోపకార బుద్ధి ఉండాలని ఈ పండుగ గుర్తు చేస్తుంది.. అందుకే దీనిని త్యాగాల పండుగ అని అంటారు అన్నారు.. ఈ బక్రీద్ నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరిని ఒకరు ఆలింగణం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఏ రబ్బాని , హఫీజ్ జియా ఉర్ రెహమాన్, ఆషిప్, ఇంతియాజ్, సయ్యద్ నవాబ్, ఎస్ కే గౌస్, ఎస్.కె సత్తార్ ముస్తఫా ఆలం, షఫీ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# పలాస-కాశీబుగ్గలో భూ కబ్జాలు, అవినీతిపై ఉక్కుపాదం వేయాలి

- **ఏఐసిసి ఓబిసి జాతీయ కోఆర్డినేటర్ ప్రముఖ వైద్యులు దువ్వాడ.జీవితేశ్వరరావు**

**పలాస,మే 28 మనసులో మాట:**



పలాసకాశీబుగ్గ మున్సిపాలిటీలో భూ కబ్జాలు అవినీతి అరికట్టాలని నిజాయతీ అవినీతి నీతివంతమైన పాలన అందించాలని పర్యావరణాన్ని ప్రభుత్వ సంపదను ప్రజల భాగస్వామ్యంతో కాపాడుకుందాం అని ఏఐసీసీ ఓబీసీ జాతీయ కోఆర్డినేటర్ ప్రముఖ వైద్యులు దువ్వాడ జీవితేశ్వర రావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పలాస కాశీబుగ్గ వేరువేరుగా పంచాయితీలుగా ఉన్న కాలంలో మొదట నగర పంచాయతీగా, ఆ తరువాత మున్సిపాలిటీగా అవతరించి ఇప్పటి వరకు నాలుగు సార్లు మున్సిపల్ ఎన్నికలు జరిగాయని ఈ ప్రాంతంలో భూ కబ్జాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో 2000 సంవత్సరం నుండి రియల్ ఎస్టేట్ రంగంలో భూముల విలువ అమాంతంగా పెరగడంతో భూ ఆక్రమణలు..భూ కబ్జాలు మొదలయ్యాయని,ఏ ప్రభుత్వం వచ్చినా ఈ కబ్జాల పర్వం కొనసాగుతూనే ఉందన్నారు. ఇది అన్ని ప్రభుత్వాల్లో, అన్ని పార్టీల్లో ఉన్న విషయమని అందరికీ తెలిసిన వారిపై చర్యలు శూన్యమని అన్నారు.గతంలో అనేక సంవత్సరాలుగా, అనేకసార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, ఇలాగే కబ్జాల పరంపర కొనసాగితే భవిష్యత్తులో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అంగుళం భూమి కూడా మిగలదని, పర్యావరణానికి పెను సవాల్ ఏర్పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు మనకు తరతరాలుగా వస్తున్న వారసత్వ సంపదని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులది, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలదని అన్నారు. 50 ఏళ్ళ క్రితం మన పూర్వీకులు ఇప్పటిలా భూ కబ్జాలకు పాల్పడి ఉంటే, ఈ సరికి పర్యావరణం నాశనమై మానవాళి మనుగడకే కష్టం అయ్యేదని, మనకెందుకులే అనే మన ఉదాశీనతే వారి బలమన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 36 వార్డుల్లోనూ మంచి అభ్యర్థులను నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని,నేర చరిత్ర, భూ కబ్జాల చరిత్ర ఉన్న వారిని పక్కన పెట్టాలని రాజకీయ పార్టీలకు సూచించారు. ఎన్నికల్లో ఓట్లకు డబ్బు, లిక్కర్ పంపిణీ చేయరాదని, ఓటు విలువను గుర్తించి, ఓటుకు డబ్బు ఇస్తే తిరస్కరించి నీతి, నిజాయితీ కలిగిన మంచి వారిని ఎన్నుకోవాలని కోరారు.నీతి నిజాయితీతో కూడిన మంచివారితో పురపాలక సంఘం ఏర్పడితే, నీతి గల అధికారులు వస్తారని,పుర ప్రజలకు నీతిగల సేవలు అందుతాయని పేర్కొన్నారు. కోట్లు ఖర్చు పెట్టి ఓట్లు కొనుగోలు చేస్తూ ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక అవుతున్నారంటే, అది కేవలం వారు ఖర్చు చేసిన దానికి వంద నుండి వేల రెట్లు సంపాదన కోసమే గాని, ప్రజల మేలు కోసం కాదన్నారు. ఈ విషయంలో పక్క రాష్ట్రమైన తమిళనాడులో ఓట్లకు డబ్బు పంపిణి చేయకుండా నిజాయితీగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలే మనకు స్ఫూర్తి అని అన్నారు.ఈ లక్ష్య సాధన కోసం మనలో కొంత మంది మొదట ప్రచారం మొదలుపెట్టి "మన ప్రాంతం, మన ప్రజలు, మన సంపద, మన పాలన" అనే విధంగా ప్రజలను, ముఖ్యంగా యువతను మేల్కొలిపి, మనకు తరతరాలుగా మన పూర్వీకుల నుండి వస్తున్న మన వారసత్వ సంపదను కాపాడుకుందామని డా. దువ్వాడ అన్నారు. పలాస నియోజకవర్గంలో మన కళ్ళ ముందే చెరువులు, గట్లు,కాలువలు,కొండలు, భూములు ఏదేచ్ఛగా మాయమవుతున్నాయని తెలిసినా అలా చూస్తూ ఉండడం, ఉపేక్షించడం కూడ ప్రజల తప్పేనని అందు వలన పట్టణంలోని ప్రజలందరం చేయి చేయి కలుపుదాం..పర్యావరణాన్ని, ప్రభుత్వ సంపదను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

# మదర్ నర్సింగ్ కళాశాలలో చట్టాలపై పోలీసుల అవగాహన కార్యక్రమం



**నర్సీపట్నం రూరల్ మే 28 (మనసులో మాట):**

నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మసాగరం మదర్ నర్సింగ్ కళాశాలలో నర్సీపట్నం డిఎస్పి పి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో గురువారం మహిళా చట్టాలపై పోలీసులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో కొత్త చట్టాలు, మహిళలపై నేరాలు, పోక్సో చట్టం కేసుల ప్రాముఖ్యత, బాల్యవివాహాలు వాటి వల్ల కలిగే అనర్థాలు, నివారణ విధానాలపై డి.ఎస్.పి విద్యార్థునిలకు సవివరంగా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినిల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించడమే కాక, సమస్యలు ఎదురైతే పోలీసులు సహాయం ఎలా పొందాలనే అంశంపై క్షుణ్ణంగా వివరించారు. అదేవిధంగా యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ప్రత్యేకంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాలని, లేదా సమీప పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ ఎల్ రేవతమ్మ, రూరల్ ఎస్సై పి రాజారావు, కళాశాల సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనసులో మాట

# బొబ్బిలి నియోజకవర్గంలో రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించిన "మహానాడు"





- ఎమ్మెల్యే బేబీనాయన , బుడా చైర్మన్ మరియు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో జరిగిన పసుపు పండుగ.
- 10 క్లస్టర్లలో ఉత్సాహంగా పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు.
- బొబ్బిలి నియోజకవర్గంలో "మహానాడు" విజయవంతం చేసిన పార్టీ క్యాడర్ కు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బేబీనాయన .

**బొబ్బిలి, మే 28,(మనసులో మాట):**

తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకునే "మహానాడు" ను బొబ్బిలి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు.. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న 10 క్లస్టర్లలో రెండు రోజుల పాటు "మహానాడు" కార్యక్రమాన్ని శాసనసభ్యులు ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన), బుడా చైర్మన్ మరియు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.. వర్చువల్ విధానంలో "మహానాడు" నిర్వహించాలన్న పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా పాటించి, నాలుగు మండలాలు మరియు పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన "మహానాడు" వేదికలలో స్వచ్ఛందంగా పాల్గొన్న తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే బేబీనాయన కృతజ్ఞతలు తెలియజేశారు. బొబ్బిలి పట్టణంలో ఉన్న "కళింగ వైశ్యభవనం" లో పట్టణ క్లస్టర్లు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే బేబీనాయన "మహానాడు" లో పాల్గొని, పార్టీ శ్రేణులతో కలిసి లైవ్ స్క్రీన్ లో జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ , జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ మరియు రాష్ట్ర నాయకుల ప్రసంగాలను వీక్షించారు. అలాగే, పార్టీ శ్రేణుల కోసం ఏర్పాటు చేసిన భోజనాలను స్వయంగా పర్యవేక్షించి, వారితో కలిసి భోజనం చేశారు. రెండవ రోజు కూడా అంతే ఉత్సాహంతో "మహానాడు" కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా గురువారం దక్షిణదేవిడీ జంక్షన్లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ర్యాలీగా "మహానాడు" ప్రాంగణానికి చేరుకుని, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. కళింగ వైశ్యభవనం లో మహానాడు వేదిక వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వర్చ్యువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు..బొబ్బిలి రూరల్ కు సంబంధించిన క్లస్టర్లలో జరుగుతున్న "మహానాడు" వేదికల వద్దకు ఎమ్మెల్యే బేబీనాయన వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేంద్ర కార్యాలయం వద్ద జరుగుతున్న "మహానాడు" ను వీక్షించారు. బాడంగి మండలం, వాడాడ గ్రామంలో "మహానాడు" ఆవరణలో మహిళలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ పాటలకు, డప్పుల వాయిద్యాలకు డాన్స్ చేసి తమ ఆనందాన్ని ప్రదర్శించారు. ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, మన నియోజకవర్గంలో "మహానాడు" జరుపుకునే అవకాశం ఇచ్చిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రెండురోజులపాటు "మహానాడు" కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని, విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అనకాపల్లి లో ఘనంగా స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**అనకాపల్లి ప్రతినిధి, మే 28 (మనసులో మాట ):**



అనకాపల్లి లో పలుచోట్ల స్వర్గీయ ఎన్టీఆర్ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ స్టేడియం సమీపంలో గల ఎన్టీఆర్ విగ్రహానికి, ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి, గవరపాలెం పార్క్ సెంటర్ లోగల ఎన్టీఆర్ విగ్రహానికి, లక్ష్మీనారాయణ నగర్ లో గల తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఉమ్మడి విశాఖ జిల్లా టిడిపి మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తో తనకున్న అనుబంధం మరువలేనిదన్నారు. నీతి నిజాయితీ, ముక్కు సూటితనం, అనుకున్నది చేయగల సామర్థ్యం కలిగిన నాయకుడని, అటువంటి నాయకుడు యుగానికి ఒకడు మాత్రమే ఉంటారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి యొక్క పేరున అనకాపల్లిలో ఎన్టీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ వారధి, ఎన్టీఆర్ హాస్పిటల్, బసవతారకం కాలనీ, ఎన్టీఆర్ మంచినీటి పథకాలు వంటి వాటిని అభివృద్ధి చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దాడి రత్నాకర్ మాట్లాడుతూ ప్రతి తెలుగువాడి ఆత్మగౌరవ ప్రతీకగా, కూడు గుడ్డ నీడ అందించాలనే సత్సంకల్పంతో నందమూరి తారకరామారావు కిలో రెండు రూపాయలకే బియ్యం, సంపూర్ణ మద్యపాన నిషేధం, ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు వంటి సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రజల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారని అన్నారు. రాష్ట్రంలోని ఏ నియోజకవర్గంలోని లేనివిధంగా ఎన్టీఆర్ పేరు మీదగా ఇన్ని శాశ్వత అభివృద్ధి కట్టడాలు చేపట్టిన ఘనత ఒక్క అనకాపల్లి కే చెందుతుందన్నారు. అటువంటి మహోన్నతవ్యక్తి ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం నిరంతరం కృషి చేస్తూ పార్టీని ముందుకు తీసుకువెళ్తున్న టిడిపి జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,రాష్ట్ర ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కృషి అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అబ్కారీ శాఖ దాడుల్లో ఒక వ్యక్తి అరెస్ట్ మద్యం స్వాధీనం



- భోగాపురం ఎక్సైజ్ సీఐ వి. రవికుమార్ వెల్లడి

**నెల్లిమర్ల, మే 28 (మనసులో మాట):**

భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ బుధవారం అనధికార మద్యం దుకాణాలపై (బెల్ట్ షాపులపై) దాడుల్లో భాగంగా రావాడ జంక్షన్ భోగాపురం మండలం లో ఒక వ్యక్తి వద్ద 07 మద్యం 180 ఎమ్మెల్ పరిమాణం గల బాటిల్స్ తో అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ రవికుమార్ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఎవరూ అనధికార మద్య దుకాణాలు (బెల్ట్ షాపులు) నిర్వహించరాదని,మరియు ప్రోత్సహించరాదని, అనధికారి మద్యం దుకాణాలు (బెల్ట్ షాపులు) యొక్క సమాచారాన్ని భోగాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వారికి తెలియజేయవలసిందిగా కోరుచున్నాము అని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడునని తెలిపారు.

ఈ దాడుల్లో ఎస్ ఐ చంద్రమోహన్, హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్ మరియు కానిస్టేబుల్ శిరీషాలు పాల్గొన్నారు.

# పినరయి విజయన్ పై ఈడి దాడులను ఖండించండి - సిపిఎం




**అచ్యుతాపురం మే 28 మనసులో మాట:**

కేరళ మాజీ ముఖ్యమంత్రి సిపిఎం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్ ఇళ్ళ పై ఈడి దాడులు నిర్వహించడం అన్యాయమని, ఈ చర్యలను తీవ్రంగా ఖండించాలని సిపిఎం పిలుపునిస్తోంది . ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రొంగలి రాము, కూండ్రపు సోము నాయుడు మాట్లాడుతూ దేశంలో ఆదర్శంగా పేరు ప్రఖ్యాతిగాంచిన కేరళ రాష్ట్రంపై కేంద్ర బిజెపి ప్రభుత్వం, కేరళ రాష్ట్ర కాంగ్రెస్, దాడులకు పాల్పడుతుందని ఇది చాలా అన్యాయమని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని రోజులలోనే ప్రతిపక్ష ముఖ్యమంత్రి పై ఇటువంటి ఈడీ దాడులు చేయించడం అమానుషమని ఇది ప్రజాస్వామ్యానికి విఘాతమని అన్నారు. కేరళ రాష్ట్ర అధికార కాంగ్రెస్ పార్టీ బిజెపితో చేతులు కలిపి ఈ నీచమైన దాడులకు పాల్పడిందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఇంటి తో పాటు కుటుంబ సభ్యుల ఇళ్లపై కూడా ఈడి దాడులు చేయడం దారుణమని వాపోయారు. ఇది కేవలం కుట్రపూరితమైన దాడిలో భాగమేనని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వెంటనే కేరళ మాజీ ముఖ్యమంత్రి పై దాడులను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సత్తిబాబు, ధర్మ రెడ్డి చినబాబు ,ఆర్ రాజశేఖర్ ,కె సత్తిబాబు , రెడ్డి ఒనుములు నాయుడు ,వి కిషోర్,ఆర్ సత్యం ,లాలం శీను ,పి అప్పలరాజు , ఎల్ రాము నాయుడు, డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉచిత మెడికల్ క్యాంప్



**విశాఖ సిటీ..మే28(మనసులో మాట):** అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వైద్య విభాగం ఆధ్వర్యంలో టి.కామేశ్వరావు నేతృత్వంలో గురువారం మెడికవర్ హాస్పిటల్స్ సౌజన్యంతో పుష్పగిరి హాస్పిటల్స్ నేత్ర వైద్య నిపుణులతో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించబడింది. క్యాంప్‌లో వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తుండగా, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడానికి ఏర్పాట్లు చేశారు.ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం చైర్మన్ పద్మనాభ రాజు మాట్లాడుతూ, సమాజానికి సేవ చేయడమే ఉద్దేశంతో ఈ విజ్ఞాన కేంద్రం ఆవిర్భవించింది. ఇక్కడే కాకుండా వివిధ ప్రాంతాల్లో కూడా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇటీవల ఆర్.ఆర్. వెంకటాపురం, ఎల్.జి. పాలిమర్ ప్రాంతాల్లో ఈ నెల 7వ తేదీన క్యాంప్ జరిగింది. అలాగే 30వ తేదీన పూడిమడకలో నిర్వహించనున్నామన్నారు. ఈ జిల్లాతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి ఇతర జిల్లాల్లో కూడా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని తెలిపారు,అంతేకాకుండా, ప్రతిరోజు సాయంత్రం సీనియర్ వైద్యులు సి. శ్రీనివాసరావు ద్వారా ఉచిత వైద్య క్లినిక్ నిర్వహించబడుతుందని ఆయన వెల్లడించారు. పిల్లల కోసం సమ్మర్ క్యాంప్, బాలోత్సవం, సృజనాత్మకతను ప్రోత్సహించే కార్యక్రమాలు, కంప్యూటర్ శిక్షణ తరగతులు, కుట్టుమిషన్ శిక్షణ తరగతులు కూడా ఈ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్నాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరిరక్షణ కమిటీ నాయకులు చంద్రమౌళి, మెడికవర్ హాస్పిటల్స్ డా. సతీష్, నిర్వాహకులు కిరణ్, పుష్పగిరి హాస్పిటల్స్ టెక్నీషియన్ రాజు* తో పాటు ఇతర టెక్నీషియన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన నీటి సమస్య పరిష్కారం



**ఎలమంచిలి టౌన్ మే28, మనసులో మాట:** పట్టణంలో రాంనగర్ సమీపంలో గల టిట్కో కాలనీలో నిన్న మోటార్ పాడై వాడుక నీరుకు అంతరాయం కడగడంతో ఒక్కరోజు జనాలు ఇబ్బంది పడడంతో, ఈ విషయం మున్సిపల్ కమిషనర్ మరియు ఏఈలకు తెలియజేయడంతో రంజాన్ సెలవులో ఉన్న స్పందించి వెంటనే తమ సిబ్బందిని పంపించి మోటార్ బాగు చేశారు. దీంతో కార్యనిర్వాహక అధ్యక్షులు ,కార్యదర్శులు, కోశాధికారి ఇన్చార్జిలు నివాసితులు హర్షం వ్యక్తం చేసి మున్సిపల్ అధికారులకు అభినందన తెలియజేశారు.

# మహానాడుకు “గ్రహణం”

- రాష్ట్రవ్యాప్తంగా జోష్... కొయ్యూరులో మాత్రం వెలవెల
- పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు గైర్హాజరు.... అంతర్గత అసంతృప్తులే కారణమా?
- ప్రభుత్వ కార్యాలయంలో రాజకీయ కార్యక్రమం.





**కొయ్యూరు, మే 28 (మనసులో మాట):** తెలుగు దేశం పార్టీకి మహానాడు అంటే కేవలం ఒక పార్టీ సమావేశం మాత్రమే కాదు... పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ రాజకీయ వ్యూహాలు, కార్యకర్తల ఉత్సాహానికి ప్రతీకగా భావించే అత్యంత ప్రతిష్ఠాత్మక కార్యక్రమం. ప్రతి సంవత్సరం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ మహాసభలో రాష్ట్ర నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని తమ ఐక్యతను చాటుకుంటారు. నాయకత్వం నుంచి వచ్చే సందేశాలు, రాజకీయ తీర్మానాలు, కార్యకర్తల సమీకరణ మహానాడుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈసారి కూడా మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా మహానాడు వేడుకలు ఘనంగా నిర్వహించగా... కొయ్యూరు మండలంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపించింది. మండల కేంద్రంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమానికి ఆశించిన స్థాయిలో కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు, యువత హాజరుకాకపోవడంతో స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. గతంలో భారీ ర్యాలీలు, బైక్ ప్రదర్శనలు, నినాదాలతో మారుమోగిన మహానాడు వేడుకలు... ఈసారి మాత్రం వెలవెల బోయినట్లు కనిపించాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. పార్టీకి వెన్నెముకగా భావించే గ్రామస్థాయి తెలుగు తమ్ముళ్లు పెద్ద ఎత్తున గైర్హాజరు కావడం గమనార్హంగా మారింది. కొంతమంది కీలక నాయకులు కూడా కార్యక్రమానికి దూరంగా ఉండటం మరింత చర్చకు దారి తీసింది. కార్యక్రమం నిర్వహించిన ప్రాంగణంలో ఆశించిన జనసమ్మర్ధం కనిపించకపోవడంతో “కొయ్యూరులో మహానాడుకు గ్రహణం పట్టిందా?” అనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. గతంలో మహానాడు పేరుతో గ్రామాల నుంచి భారీగా తరలివచ్చే కార్యకర్తలు ఈసారి కనిపించకపోవడం పార్టీ అంతర్గత పరిస్థితులపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వెలుగు శాఖలకు కలిపి ఒకే చోట ఉన్న ప్రభుత్వ భవనంలో ఈ తరహా రాజకీయ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు నిర్వహించడంపై స్థానికంగా తీవ్ర అభ్యంతరాలు, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలను రాజకీయ వేదికలుగా మార్చడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. పార్టీ కోసం సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్యకర్తల్లో అసంతృప్తి పెరిగిందా? స్థానిక నాయకత్వంపై నమ్మకం తగ్గిందా? లేక కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం లేకపోవడమే కారణమా? అనే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. కొంతమంది కార్యకర్తలు పేర్లు వెల్లడించకుండా మాట్లాడుతూ... “పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తించడం లేదు”, “గ్రామస్థాయి నాయకులతో సమన్వయం తగ్గింది”, “ఎన్నికల సమయంలో మాత్రమే కార్యకర్తలు గుర్తుకొస్తున్నారు” అంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. మరికొందరు “పార్టీ కార్యక్రమాల్లో ఒకప్పుడు కనిపించిన ఉత్సాహం ఇప్పుడు తగ్గిపోయింది” అని అభిప్రాయపడుతున్నారు. అయినప్పటికీ పార్టీకి అత్యంత కీలకమైన మహానాడు కార్యక్రమంలో కనీస స్థాయి సమీకరణ కూడా కనిపించకపోవడం నాయకత్వానికి ఆందోళన కలిగించే అంశమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మహానాడు సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి, సంక్షేమం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై నాయకులు మాట్లాడినా... ఆ సందేశాలు క్షేత్రస్థాయిలో కార్యకర్తల్లో పెద్దగా ఉత్సాహం నింపలేకపోయినట్లు కనిపించిందని స్థానికులు పేర్కొంటున్నారు. కొయ్యూరు వంటి ప్రాంతాల్లో పార్టీ పునర్వ్యవస్థీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సీనియర్ నాయకులే అభిప్రాయపడుతున్నట్లు సమాచారం.ఇదిలా ఉండగా... త్వరలో గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి కార్యకర్తల్లో మళ్లీ నమ్మకం పెంచేందుకు పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగకపోతే భవిష్యత్‌లో పార్టీకి మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మొత్తంగా చూస్తే... రాష్ట్రవ్యాప్తంగా జోష్‌తో సాగిన టీడీపీ మహానాడు వేడుకలకు భిన్నంగా, కొయ్యూరులో మాత్రం కార్యక్రమం పూర్తిస్థాయి ఉత్సాహాన్ని కోల్పోయినట్లు కనిపించింది. ఒకప్పుడు పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉన్న మండలంలో ఈసారి కనిపించిన ఈ నిశ్శబ్దం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## మోసయ్యపేటలో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**అచ్యుతాపురం మే 28 మనసులో మాట:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు మన అన్న నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా మోసయ్య పేట గ్రామంలో ఉభయగోదావరి జిల్లాలో పట్టుబద్ధుల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించడం జరిగింది ఈ అలాగే తెలుగుదేశం పార్టీ కార్యాలయం జరుగుతున్న రెండో రోజుజరుగుతున్న క్లస్టర్ 9లో మహానాడు కార్యక్రమ మును డిజిటల్ స్క్రీన్ వీక్షాజీ ఎంపీపీ రాజాన రమేష్ కుమార్. మండలంపార్టీ అధ్యక్షులు పీలా తులసీ రామ్. రాజాన నానాజీ పతి వాడ చిన్నయ్య నాయుడు పుర్రె శ్రీను. లాలం నాగేశ్వరావు రెడ్డి నగేష్.కూనిశెట్టి రమణ. గ్రామాల్లో ఉన్న నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా 'మహానాడు' వేడుకలు

- నెల్లిమర్ల టిడిపి శ్రేణుల మధ్య పండగ వాతావరణం

**నెల్లిమర్ల, మే 28, (మనసులో మాట):**



తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా, నెల్లిమర్ల మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో గురువారం 'మహానాడు' వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వర్చువల్ పద్ధతిలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు స్థానికంగా పండుగ వాతావరణాన్ని తలపించాయి. కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు.

మూడు క్లస్టర్లలో ఘన నివాళులు

**మండలంలోని మూడు ప్రధాన ప్రాంతాల్లో వేడుకలు జరిగాయి:**

**క్లస్టర్ 1: కొండవెలగాడ**
**క్లస్టర్ 2: రామతీర్థం**
**క్లస్టర్ 3: నెల్లిమర్ల పట్టణం**

ఈ కార్యక్రమాల్లో భాగంగా, నాయకులు ముందుగా ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ, తెలుగు జాతి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి సువ్వాడ వనజాక్షి, సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, నగర పంచాయతీ టిడిపి అధ్యక్షులు లెంక అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ ప్రతినిధి గేదెల రాజారావు, తుమ్మలపేట పీఏసీఎస్ అధ్యక్షులు దంతులూరి అజేయ్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ, నేటికీ ప్రజల పక్షాన నిలబడుతోంది. పేద ప్రజల కష్టాలను గుర్తించి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప మానవతావాది ఆయన. అందుకే ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అట్టాడ శ్రీధర్, బొంతు వెంకటరమణ, కాళ్ల రాజశేఖర్, ఆల్తి శ్రీనువాసరావు, తాడ్డి సత్యనారాయణ, అవనాపు సత్యనారాయణ, కింతాడ కళావతి, నల్లం శ్రీనివాసరావు, పోతల రాజప్పన్న, గురాన చక్రీధర్, పంచాది కిరణ్, బైరెడ్డి కల్యాణ్ చక్రవర్తి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన మహానాడు... డాన్సులతో సందడి చేసిన టిడిపి నేతలు



**ఎస్ .రాయవరం, మే 28,(మనసులో మాట):**

తెలుగుదేశం పార్టీ ఆదేశాలతో హైబ్రిడ్ విధానంలో క్లస్టర్ స్థాయిలో మహానాడు కార్యక్రమాలను నిర్వహించారు .అందులో భాగంగా రెండవ రోజు పెదగుమ్మూలూరు ,యస్ .రాయవరం క్లస్టర్ల సంబంధించి మహానాడు ఆన్లైన్లో ప్రారంభం అవ్వడంతో ముఖ్య నాయకులు రాష్ట్రస్థాయిలో జరిగే ప్రసంగాలను తిలకించడం జరిగింది .పెదగుమ్మూలూరు కె సూట్స్ కళ్యాణ మండపంలో జరిగిన మహానాడుకు నియోజవర్గం పరిశీలకులు ఈతలపాటి సుజాత పరిశీలించడం జరిగింది. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్ .రాయవరంలో వెంకటేశ్వర కళ్యాణ మండపంలో జరిగిన మహానాడు ముగింపు సందర్భంగా కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు .రెండవ రోజు కూడా పెట్టుగోళ్లపల్లి గ్రామం నుంచి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి సైకిల్ తొక్కుకొని మహానాడుకు హాజరయ్యారు. అనంతరము రెండు సమావేశాల్లో కార్యకర్తలతో కలిసి నాయకులు సామూహికంగా భోజనాలు చేయడం ముఖ్య కార్యకర్తలను సన్మానించారు. ఈ సమావేశాల్లో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మాజీ ఎంపీపీ వై. వినోద్ రాజు, మండల టిడిపి అధ్యక్షులు అమలకంటి అబద్ధం, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, క్లస్టర్ ఇన్ చార్జ్ లు గుర్రం రామకృష్ణ, తుమ్మపాల నాగేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు ఎన్. వెంకట్రాజు, కందుల వెంకటేశ్వరరావు, రావి రమణబాబు, వంగలపూడి గోవిందు, ప్రత్తిపాటి సత్యనారాయణ, పుట్టా సుధాకర్,సోమిరెడ్డి రాజు ,కరణం శివ ,బోయిన రామవతారం ,ఐ టీడీపీ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి శ్రీనివాసరావు ,నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు సుంకర శ్రీను ,మండల తెలుగు యువత అధ్యక్షుడు కోడ లోవరాజు, ఉపాధ్యక్షుడు సమ్మంగి బీమా, ఐ టిడిపి ప్రతినిధులు అల్లు మోహన్ అనిల్ వర్మ,నానాజీ తదితరులు పాల్గొన్నారు .

# సంఘ సంస్కర్త వీర్ సావర్కర్ జయంతి



- జాతి జాగృతిలో సావర్కర్ పాత్ర కీలకం
- ఇండియా ఎన్.యు.జే.ఈ
- జర్నలిజం స్కూల్ చైర్మన్ నాగనబోయిన నాగేశ్వరరావు

**విశాఖసిటీ..మే28(మనసులో మాట):**

అంటరానితనం, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి, జాతిని జాగృతం వచ్చిన మహోన్నత వ్యక్తి వినాయక్ దామోదర్ సావర్కర్ అని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్.యు.జె ఐ) జర్నలిజం స్కూల్ చైర్మన్ నాగనబోయిన నాగేశ్వరరావు అన్నారు. భారత స్వాతంత్ర్య సమర యోధుడు, సంఘ సంస్కర్త వీర్ సావర్కర్ జయంతి సందర్భంగా కేంద్ర యువజన సర్వీసులు క్రీడల మంత్రిత్వ శాఖ పరిధిలోని మేరా యువ భారత్ నరవలోని బెహరా నర్సింగ్ కాలేజీ గురువారం నిర్వహించిన వేడుకలో నాగేశ్వరరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా చైతన్యం ద్వారా బ్రిటిష్ పాలకులపై సావర్కర్ తిరుగుబాటు జెండా ఎగురవేశారని ఆయన పేర్కొన్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ రత్నగిరిలో పత్రిత్ పావన్ మందిర్ నిర్మించిన సావర్కర్ అందరికీ ప్రవేశం కల్పించారని నాగేశ్వరరావు గుర్తు చేశారు. హిందీ, ఆంగ్ల భాషల్లో చక్కటి పుస్తకాలు రాశారని ఆయన గుర్తు చేశారు. మహిళల అభ్యున్నతకి కృషి చేస్తూ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సావర్కర్ ముఖ్య భూమికి పోషించారని తెలిపారు. అండమాన్ నికోబార్ దీవుల్లోని సెల్యూలార్ జైలులో కఠిన కాగారాన్ని అనుభవించారని ఆయన తెలిపారు. నర్సింగ్ కాలేజీ అధ్యాపకురాలు సునీత అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విభాగం ఫ్యాకల్టీలు, మేరా యువ భారత్ ప్రతినిధులు హాజరయ్యారు. ముందుగా వీర సావర్కర్ చిత్ర వఠానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. భారత మాత జై నినాదాలతో కార్యక్రమం పూర్తి అయింది.

# బడ్డుమాసింగిలో ఉచిత వైద్యశిబిరం



**పాలకొండ, మే 28 (మనసులో మాట) :**

పాలకొండ మండల పరిధిలోని బడ్డుమాసింగి గ్రామం అల్లూరి సీతారామరాజు ఎస్టి వీధి వినాయక మండపం వద్ద పాలకొండ విజయ హాస్పిటల్ వారి ఉచిత మెగా వైద్య శిబిరాన్ని కూటమి నాయకులు వేణువు అనిల్ కుమార్ ,ఎంపీటీసీ నిమ్మక ప్రసాద్,రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. రోగులకు నాణ్యమైన వైద్యం, మందులు ఉచిత పరీక్షలు ఈ శిబిరం ద్వారా రోగులకు అందించారు .ఈ కార్యక్రమంలో బడ్డుమాసింగి కూటమి నాయుకులు వేణువు భీమలింగం,పుట్ట శ్రీను,చింత రాజు,చింతాడ చంద్రయ్య,రెడ్డి ప్రసాద్,నిమ్మక సునీల్ గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజయ హాస్పిటల్ మేనేజ్మెంట్ కి గ్రామ ప్రజలు, పెషేంట్లు ద్వారా కూటమి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## క్లస్టర్ - 7 లో కంది చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో రెండవ రోజు మహానాడు వేడుకలు



**నెల్లిమర్ల, మే 28,( మనసులో మాట):**

డెంకాడ మండలం క్లస్టర్7 లో మహానాడు" రెండవరోజు కార్యక్రమంలో భాగంగా కంది చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.. అనంతరం చంద్రశేఖర రావు మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు గారి జయంతిని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ ప్రతి ఏటా జరుపుకునే పండగ లాంటిదే ఈ మహానాడు కార్యక్రమం అన్నారు. అంతేకాకుండా నందమూరి తారక రామారావు గారు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతకై వారు చేసిన కృషిని ప్రశంసించటం అభినందనీయమని తెలియజేశారు.ఈ కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలు కాగితాల సత్యనారాయణ రెడ్డి, బొబ్బాది గురునాయుడు , కొసర అబద్ధం, అలబాని సన్యాసి , కొయనేని రమణ (జిన్నా) , కంది అప్పలనాయుడు , కలిశెట్టి అప్పలనాయుడు , అబోతుల ఆదినారాయణ , చుక్క స్వామి నాయుడు , బ్యాంక్ అప్పలనాయుడు, జగదీష్ రాజు, పైల రామారావు కి శాలువాతో సత్కరించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డెంకాడ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు , యూనిట్ ఇంఛార్జిలు కలిదిండి పాణీరాజు, సంఘం సురేష్, పడాల చిన్నారావు , కొర్నాన ఆదిబాబు, పిన్నింటి రమేష్‌నాయుడు , తెలుగు యువత అధ్యక్షులు కంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## 23 సంవత్సరాల తర్వాత ఓటర్ల జాబితా సవరణ




- **ఓటర్ల జాబితా నవీకరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి**
- **జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**
- **ప్రతి బూత్ పరిధిలో రాజకీయ పార్టీలు బిఎల్ఏ ను నియమించాలి**

**విశాఖసిటీ..మే28(మనసులో మాట):**

స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్లో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని,అనర్హులు లేకుండా చూడాలని ఎన్నికల సంఘం ఖచ్చితమైన , నవీకరింపబడి ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండేందుకు సర్ కార్యక్రమం చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 2002లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగిందని, 23 సంవత్సరాల తరువాత ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ఎన్నికల సంఘం పట్టిందన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి రాజకీయ పార్టీలన్నీ తమ పూర్తి సహకారం అందించాలని కోరారు. రాజకీయ పార్టీలు ప్రతి బూత్ కు ఒక బిఎల్ఏను నియమించాలని, ఆ బి ఎల్ ఏ బూత్ పరిధిలో ఓటరుగా నమోదయి ఉండాలని లేదా ఆ నియోజకవర్గంలో ఓటర్ గా నమోదయి ఉండాలని తెలిపారు. బిఎల్ఏ లను, బిఎల్ఓ లను అనుసంధానం చేస్తామని, జూన్ 2వ తేదీలోగా బిఎల్ఎల్ తో సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటికి బిఎల్వో వచ్చి ఎన్యూమరేషన్ ఫామ్ ఇస్తారని, బిఎల్ఓ వచ్చినప్పుడు కుటుంబంలో ఎవరూ లేకపోతే మూడుసార్లు ఆ గృహానికి వస్తారని ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈఆర్వోలు సమావేశాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గస్థాయిలో సమావేశం జరుగుతున్నట్లు ముందుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిసే విధంగా నోటీసులు ఇవ్వాలని ఈఆర్వో లకు సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడు. నియోజకవర్గ ఇ ఆర్వోలు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి లోడగల కృష్ణ, బిజెపి ప్రతినిధి పరశురామరాజు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి సుధాకర్, బీఎస్పీ తరపున శివప్రసాదరావు, సిపిఐ ప్రతినిధి వి కృష్ణారావు, సిపిఎం తరపున జ్యోతీశ్వర రావు, వైయస్సార్సీపి తరపున రవికుమార్ జనసేన తరపున దుర్గాప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



- **ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల**
- **నివాళులర్పించిన జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి**

**విశాఖసిటీ మే28( మనసులో మాట):**

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు విశాఖపట్నం కలెక్టరేట్ లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం కలెక్టరేట్ మీటింగు ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమెతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు, టూరిజం అధికారిణి మాధవి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి ఇతర అధికారులు నివాళ్లర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సేవ, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎన్టీఆర్ చేసిన కృషిని స్మరించుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించడంలో ఆయన పాత్ర విశేషమని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ప్రజా జీవితంలో చూపిన నిబద్ధత ఆదర్శప్రాయమని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్లోని పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రోలుగుంట మండలంలో మహానాడు క్లస్టర్ మీటింగ్‌లో ఎన్టీఆర్‌కు ఘన నివాళులు.

**రోలుగుంట మనసులో మాట మే 28:**



అనకాపల్లి జిల్లా, రోలుగుంట మండలం.రోలుగుంట మరియు శరభవరం గ్రామాల్లో నిర్వహించిన మహానాడు (1వ క్లస్టర్ మీటింగ్) కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గౌరవనీయులు కేఎస్ఎన్ఎస్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ 103వ జయంతిని పురస్కరించుకుని ముందుగా కేక్ కటింగ్ చేసి, అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, యుగపురుషుడు, విశ్వవిఖ్యాత నట సార్వభౌముడు, తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేతగా ఎన్టీఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సినీ రంగంలో అపార ఖ్యాతి సంపాదించిన ఎన్టీఆర్, ప్రజాసేవ పట్ల అంకితభావంతో రాజకీయాల్లోకి ప్రవేశించి పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. తెలుగు జాతికి ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు పంచాడ చంద్రతోపాటు 12 గ్రామాల లోగల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.